## నేటి దృశ్యం



### దిక్కులేదింక...

పంచవన్నెల రామచిలకా!
నువ్వు సరిగ్గానే చూసావు
నేను నీ గోరువంకనే!?!



-కిలపర్తి దాలినాయుడు
7780589336


నేటి నిజం

# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 24-3-2022


## ఘంటారావం

సంపద ఉందని
సంబరపడకు
సంస్కారమే
సంపదని మరువకు.

రెండు చెవులు ఉన్నది
ఎక్కువ వినటానికే
ఒకే ఒక్క నోరున్నది
తక్కువ మాట్లాడటానికే

అబదాలలో ఆరితేరినవాళ్ళు
జ్ఞాపకశక్తిలో ఘనాపాఠీలు
నిజాలలో నిగ్గుదేలిన వాళ్లు
నిర్భయజీవిత పాఠాలు.



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

# 'అక్షరం నా నేస్తం" అంటున్న బూర దేవానందం

పుస్తక సమీక్షలు





గొడుగవుతుంది
మనిషి చివరి మజిలీకి తన
అనువునే అర్పిస్తుంది
మానుకు త్యాగం మాత్రమే
తెలుసు" అనడమే కాదు.. మరో
అడుగు ముందుకేసి
"మనిషికి స్వార్థం మాత్రమే
తెలుసు
చెట్టును హత్యచేస్తే శిక్షుండాలి" అని తీర్మానిస్తాడు.

సిరిసిల్లలో పుట్టి పెరిగిన ఈ కవి తన ఊరిని 'ఒకనాటి శిరిశాల'గా వర్ణిస్తాడు.

మహాకవి సినారె పుట్టిన ఊరు హన్మాజీపేగ అయినా చదువుకున్న ఊరు సిరిసిల్ల. ఆ ఆత్మీయ కవి మరణంతో చిన్నబోయిన ఊరు అల్లాడిపోతోంది అంటు విలపిస్తాడు దేవానందం. 'మళ్ళీ పుట్టాలి సినారె' అని ఎదురు చూస్తున్నాడు.

'ఆసు' యంత్రాన్ని ఆవిష్కరించిన పద్మశ్రీ చింతకింది మల్లేశం, సావిత్రీబాయి పూలే, జయశంకర్‌సార్, వింగ్ కమాండర్ అభినందన్ గారలపై కవితలల్లాడు.

"మృత్యువు ముందు నిలుచున్నా
భయమన్నదే ఎరుగని వాడి''గా వీరజవాన్‌ని కీర్తించడం బాగుంది.

"అక్షరం నాకు చూపింది కవితా మార్గం అందుకే అక్షరం నా నేస్తం" అంటున్నాడు బూర దేవానందం. అక్షరంతో నేస్తం ఊరికే ఉండనిస్తుందా? కవిత్వంతో ఊరిస్తుంది. అయస్కాంతంలా ఆకర్షిస్తుంది. ప్రతి దృశ్యం కవితై ప్రవహిస్తుంది. కొత్తగా రాస్తున్న వాళ్ళను కవిత్వం అనుక్షణం కుట్టుతునే వుంటుంది. ఫలితంగా దేవానందం ఏబయికి పైగా కవితలతో తన తొలి సంపుటిని ప్రకటించారు.

ఈ కవికి ప్రకృతి అంటే యిష్టం. పర్యావరణ పరిరక్షణ ఎంతో యిష్టం. 'చెట్టు' అంటే మరీ యిష్టం.

"మాను మనిషికి ఆహారమవుతుంది
ఎండకు నీడవుతుంది, వానకు

ప్రతులకు:బూర దేవానందం
1-1-89, వెన్‌కమ్‌పేట్
సిరిసిల్ల-505 301
సెల్: 9494996143



- రమణ వెలమకన్ని
సెల్: 9866015040

# పరిణత కవిత్వం "ఎన్నో రంగుల చీకటి"!

**'కోరికలూ కలలు మిణుకు మిణుకుమనే**
**చుక్కల్లా చుట్టుముట్టేస్తాయి**
**ఎక్కడ పోగేసుకోవాలో తెలియక**
**పైకి విసిరి కొడతాం..**
**ఎన్ని నక్షత్రాలు దాచిపెడితే**
**ఒక్క ఆకాశం నిండుతుందో**
**ఊహకే అందదు.."** అంటూ కవయిత్రి భారతి కోడేగారు "ఎన్నో రంగుల చీకటి" పేరుతో ఓ కవితా సంపుటిని వెలువరిం చారు. ఆశలూ నిరాశలూ వెలుగు నీడల్లా.. చావు బతుకుల్లా దోబూచులాడుతుం టాయనీ.. ఎన్ని చావు బతుకుల చక్ర భ్రమణాలైతే ఒక్క జీవితం ముగుస్తుందో ఎవరికీ తెలియదంటూ.. తాత్త్విక చింతనతో తమ కవిత్వానికి జీవం పోశారు.

భారతి కోడెగారు ఈ సంపుటిలోని కవితా వస్తువుల ఎంపికలో వైవిధ్యాన్ని ప్రదర్శించారు. అభివ్యక్తిలో సరళత్వానికి పెద్దపీట వేస్తూ.. నవీనత్వానికి చోటు కల్పించారు.

**"ఒక్కొక్క చినుకు"** కవితలో కవయిత్రి ప్రకటించిన భావాలు ఆమె యొక్క పరిణత వ్యక్తిత్వాన్ని చాటే విధంగా కొలువుదీరాయి. కన్నీళ్ళు పోసి మరీ గులాబీలు పెంచుతావు.. ముళ్ళు గుచ్చుకుంటాయనీ.. పూజకు గులాబీలు వాడొద్దనీ.. దేవుడెప్పుడో అజ్ఞాపించి ఉంటా డు అన్న పంక్తులు...నర్మ గర్భంగా గొప్పసందేశాన్ని మోసుకొచ్చాయి.

అసలేదీ అర్థం కానట్లుగానే ఉంటుంది. ప్రతి ఆలోచనా ప్రశ్నార్థకంగానే ముగుస్తుం దన్న వాస్తవాన్ని **'ధూళిలో కలిసాక"** కవిత ద్వారా చక్కగా విడమరిచి చెప్పారు. ఈ కవితలో కవయిత్రి తమ తాత్త్వికతను ప్రదర్శించారు. ప్రతి పంక్తీ ఆలోచనాత్మ కంగా మలచడంలో ఆమె సఫలీకృతు లైనారు.

మనుషుల్లో గూళ్ళుకట్టి- నీ దగ్గర ఉన్నవన్నీ దాచాలనుకుంటావు.. నీ కన్నీళ్ళె వరో తుడవాలనీ.. నిన్ను కాస్త ఓదార్చాలనీ కోరుకుంటావు.. దుఃఖం నింపుకున్న మనుషులను సమూహం భరించలేదని అందుకే అందరం నవ్వు నటించడం నేర్చుకున్నామని ఈ పాటికి అర్థమయ్యే ఉంటుందని జీవిత సత్యాన్ని కవయిత్రి **"నదుల్లాంటి మనుషులు"** కవిత ద్వారా చక్కగా ఆవిష్కరించారు.

ఆకులు రాల్చుకుని మోడైన చెట్టుది తాత్కాలిక ఒంటరితనమేనని చెట్టుకు దూరమైన ఆకు మాత్రం వడలి వాడి శాశ్వతంగా మరణిస్తుందనీ... మోడైన చెట్టులాంటి మనుషులే మొరటుగా మారిపోతుంటారనీ.. మనల్ని నిప్పుల్లో తోసి మంటల్లో కాలుతుంటే చీకటిని దూరం చేసే వెలుగు ఇచ్చామంటారనీ.. కత్తితో కోసి బాధతో అరుస్తుంటే.. నిశ్శబ్దాన్ని ఛేదించా మంటారంటూ 'విషాద మోహనం'



కవితలో మసకబారుతున్న మానవ సంబంధాలకు లోకం తీరుతెన్నులకు అద్దం పట్టారు.

శిశిరానికి వసంతానికి మధ్య సంధి కాలం కొనసాగుతూనే ఉంటుందని అంటూ 'సందిగ్ధకాలం" కవితకు రూపమిచ్చారు.

**'అపరిచిత సంకేతం'** కవితలో.. ముం దున్నజీవితం కన్నా మోసుకొస్తున్న జ్ఞాప కాలు.. తీయగా అనిపించడమే ముగింపుకి సంకేతమని భారతిగారు మంచి ముగింపు నిచ్చారు.

కవయిత్రి భారతి కోడేగారు ఆయా కవితలకు శీర్షికలు పెట్టడంలో తమ ప్రతిభను ప్రదర్శించారు.

**'పూలశోక గీతిక'** అంటూ ఓ కవితకు పేరు పెట్టారు. తుమ్మెద సున్నితంగా కనిపించడం లేదిప్పుడు.. దాని పాట కూడా ఏమంత శ్రావ్యంగా వినిపించడం లేదంటూ ఈ కవితను ఎత్తుకున్న తీరు బాగుంది. ఈ కవితలో పొందుపరిచిన మిగతా పంక్తులు.. పైకి తుమ్మెద గురించి రాసినా.. ఎన్నో విధాలుగా విశ్లేషించుకోవడానికి యోగ్యంగా ఉన్నాయి.

కవయిత్రి ఏ కవితకు అదే సాటి అన్న విధంగా ప్రతీ కవితలోని అభివ్యక్తికి కొత్తదనాన్ని ప్రదర్శించారు. 'కురవని నింగి" కవితలో గజిబిజిగా అల్లిన వాక్యాల నుండి ఒక్కో పదాన్ని విడదీసి.. అర్థాన్ని వెతుకుతుం టావు.. కవిత్వం కాకుండానే కరిగిపోయిన కన్నీళ్ళ లెక్కలెప్పటికీ తేలవని తేల్చి చెప్పారు.

ప్రశ్నల వర్షంతో 'తగలబడిన వంతెనలు' కవితను తీర్చిదిద్దారు.

**'నిర్బంధ సమయాల్లో"** కవితలో.. కవయిత్రి ప్రకటించిన ఆలోచనలు బాగున్నాయి.. నిర్బంధ సమయాల్లో కూడా గుండెలు కొట్టుకుంటున్నట్లు నటిస్తూనే ఉంటా యన్న వాస్తవాన్ని చక్కగా తెలియజెప్పారు.

ఒక్కోసారి అలాగే జరుగుతుంది
పలకరింపులు పరామర్శలు
నిషేధించబడతాయని ఈ కవితను ప్రారంభించిన తీరు కవయిత్రి యొక్క పరి ణతి చెందిన మనస్తత్వాన్ని తెలియ జేసేలా ఉంది.

స్వప్నాలేవీ రెప్పలు దాటకూడదనీ.. కన్నీళ్ళు కంటనే పడకూడదనీ ఆజ్ఞలు జారీ అవుతాయంటూ కొనసాగించడం లో కవయిత్రిగారి ప్రతిభను ప్రశంసించకుండా ఉండలేము.

**'నీ నీడన కూర్చునేది ఎవరో!"** కవితలో కవయిత్రి భారతిగారు చక్కని భావుకతను ప్రదర్శించారు. వెన్నెల రాత్రి కొబ్బరి చెట్లు కొమ్మలతో కరచాలనం చేసుకుంటున్నా యని చెప్పడం బాగుంది.

**'కూడలిపాట'** కవితలో ఉన్నచోట ఉండలేము.. చలనం లేని జీవితం.. మృత్యువులా కనిపిస్తుందనీ ద్వేషం బరువును మోయలేము.. దింపుకునేందుకు కాస్త చోటే దొరకదు.. ఇంత చిన్నప్రపంచంలో ఎన్ని అపనమ్మకాలు అంటూ వ్యాఖ్యానించారు. నిజమే కదా!

**'అబద్ధాల చప్పుడు'** కవిత అసక్తికరంగా ఆలోచనా త్మకంగా మలచబడింది.

చీరకి అద్దాలు అతికించినట్లు చీకటి ఆకాశానికి చుక్కలు అతికించానని ఎప్పు డైనా చెప్పానా? అంటూ కవితను ప్రారంభిం చడం బాగుంది. కలలన్నీ పోగేసి సముద్రం లోకి విసిరేస్తే అలలు మళ్లీ ముందుకు తోసాయని కూడా చెప్పలేదు కదూ.. అంటూ కొనసాగిం చిన తీరు బాగుంది.

ఇలా ఎన్నో కవితాపంక్తులు ఉదహరించడానికి ఈ గ్రంథంలో ఉన్నాయి.. కవయిత్రి భారతి కోడెగారి కవిత్వంలో ఆమె సున్నిత మనస్తత్వం ఉత్తమ వ్యక్తిత్వం.. తాత్త్విక చింతనం ముప్పేట అల్లుకుపో యాయి. అలతి అలతి పదాలతో అద్భు తమైన భావాలను ఆవిష్కరిం చారు. చాలా కవితల క్రింద ఆంగ్లంలో తమ ఆలోచ నలను జోడించి ఈ సంపుటికి మరింత శోభను పెంచా రు. శీర్షి కలు పెట్టడంలో.. ప్రతీ కవితా వస్తువును విశ్లే షించడంలో.. ఆమె చూపిన నేర్పరితనం అభినం దనీయం..

కవితా పంక్తులుపైకి చూడటానికి సరళంగా కనిపించినప్పటికీ.. ఆయా పదాల పరదా మాటున గాఢమైన భావాలు కొలువుదీరాయి. సామాజిక చింతన భారతి ప్రకటించిన కవితలు సందేశంతో పాటు ఓ గొప్ప అనుభూతిని పంచేలా ఉన్నాయి. మానవ సంబంధాలను కనుమరుగవుతున్న బంధాలు.. అనుబంధాలను అక్కడక్కడ బల ంగానూ.. తాత్త్వికంగానూ ప్రకటించారు.

**'నవ్విపోయే కన్నీళ్ళు'** కవితలో అన్ని దుఃఖాలు కన్నీళ్ళలో ఇమడవనీ.. నదుల్నీ కొండల్నీ రెండుగా చీల్చి నడిసొచ్చే మనుషులకు నొప్పిని హత్తుకోవడం.. బాధని దూదిలా ఎగరేయడం ముక్కటు ముక్కలైన మనసులను అతికించుకోవడం చేతగాకనా అని కన్నీళ్ళు నవ్విపోతాయని మంచి ముగింపునిచ్చారు.

భారతిగారు తమ కవిత్వంలో వస్తు ఎంపిక, శీర్షిక- ఎత్తుగడ.. కవిత్వ నిర్వహణ.. పదబంధ ప్రయోగం.. శిల్పం.. అభివ్యక్తి.. ముగింపు వంటి అంశాల్లో చూపిన శ్రద్ధను ప్రశంసించకుండా ఉండలేము. పుస్తక రూపకల్పన లో.. నవీనత్వాన్ని చాటారు. ఆప్త వాక్యాలను గ్రంథం చివరన పెట్టడం బాగుంది. కవయిత్రి భారతి కోడెగారు తమ జీవితానుభవాన్ని...లోక పరిశీలనను జోడించి వ్రాయ బడిన ఈ కవితలు అందరినీ ఇట్టే ఆకట్టు కుం టాయి. ము న్ముందు మరింత గాఢమైన కవిత్వాన్ని మనకు అందిస్తారని ఆశిద్దాం..



ప్రతులకు: భారతి కోడె
సెల్: 9440103411
- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

## ఔషధాలగని..

చర్మ సౌందర్యానికి రక్షగా
చుండ్రు నివారిణిగా
కేశ సంపదను పెంచేదిగా-

పంటపొలాలకు ఎరువులా
క్రిమిసంహారిణిలా
దంతధావనానికి బ్రష్ లా
దోమలను తరిమేసేదిగా
సూక్ష్మ జీవులను దరిచేరనీయనిదిగా-

గడపమాలక్ష్మిగా మారిన కలపగా
ఇంట్లో వాడే వంటచెరుకుగా-

ఇలా ... ఎన్నెన్నో రకాలుగా
ఉపయోగపడే కల్పవృక్షం
మన ఇంటిముందుండే వేపచెట్టు-

ఏ పురుగు సోకిందో నేడు
ఏ తెగులు తాకిందో దానికి
ఆకులన్నీ మాడిపోతున్నాయి

కొమ్మలన్నీ ఎండిపోతున్నాయి
పచ్చని చెట్లన్నీ
మోడుగా మారిపోతున్నాయి-

మన ఆరోగ్యాన్ని కాపాడే ఆ కల్పవృక్షం
నేడు కనుమరుగయ్యేలా ఉంది-

తెగులు సోకిన చెట్లకు మందులు కొడదాం
ఆ మాయదారి పురుగును నాశనం చేద్దాం-

మన వేపచెట్టు
మళ్ళీ చిగుళ్ల వేసేలా చూద్దాం
ఈ ఏడాది ఉగాదికి
వేపపువ్వు కరువైపోయింది మనకు-

మళ్ళొచ్చే ఉగాదినాటికైనా
ఎన్నో ఔషధగుణాలున్న మన చెట్టు
వేపచెట్టును బతికించుకుందాం
మన బతుకులను బాగు చేసుకుందాం
ప్రతి ఒక్కరం మన బాధ్యతగా
మన చెట్టును కాపాడుకుందాం



-దేవలపల్లి సునందారెడ్డి
8297744716



ఇచ్చి
పుచ్చుకొంటే
పెరిగేది
ప్రేమ-

ఆశిస్తే
తరిగేను
సుమా!



-డా॥విప్లవ్‌దత్ శుక్లా
సెల్:9849185878

# నాన్నలంతా ఒకటేనా?

నాకు మాత్రం
నాన్నంటే హడల్.
రోజూ తాగొచ్చి
అమ్మను కొట్టే
నాన్నంటే
ఏవగింపు.

(కథ)

"నువ్వెన్నైనా చెప్పు మౌళీ! నాకు మాత్రం మా నాన్నంటే ప్రాణం. లోకంలో జనాలందరూ అమ్మలను అందలాలెక్కిస్తారు కానీ, నాకు మాత్రం మా నాన్నంటేనే ఇష్టం. నేనండిగిందే ఆలస్యం, ఏదైనా వెంటనే తెచ్చిచ్చే వారు నాన్న. "

"అదృష్టవంతుడివి సూరీ! నాకు మాత్రం నాన్నంటే హడల్. రోజూ తాగొచ్చి అమ్మను కొట్టే నాన్నంటే ఏవగింపు. తన సంపాదనే కాదు, అమ్మ కూడబెట్టిన సొమ్ము కూడా వెతికి మరీ చీట్లపేకలో తగలేసిన నాన్నంటే జుగుప్స."

"మా నాన్న మాత్రం నిండుకుండ. తన పనేమో, తానేమో. జీతం రాగానే తన ఖర్చులకు ఉంచుకొని, మిగతాది అమ్మకిచ్చేవారు. ఇంటి ఖర్చులతో పాటు మా పాలన, పోషణ, చదువులు, వీటన్నింటినీ అమ్మే చూసుకునేది. అంతే కాదు, మా పేర నెలకింతని బ్యాంకులో జమ చేసేది. మా అమ్మ ప్లానింగ్ వల్లే మేమిద్దరన్నదమ్ములం పీ.జీ. చేసి మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డాం." భరణి, తన తల్లిదండ్రులతో తన అనుబంధాన్ని వివరించాడు.

"మనం చాలా కథల్లో రిక్షా, నడిపేవాళ్లు తాగుబోతులనీ, భార్యలపై చేయి చేసుకుంటారనీ, వారికి లేని వ్యసనముండదనీ, చదువుతాం. కాని మా నాన్న, ఆటో రిక్షా నడుపుతూ నన్నూ, మా చెల్లినీ చార్టెడ్ ఎకౌంటెన్సీ దాకా చదివించాడు. ఒకే సంవత్సరం మేమిద్దరం సి.ఏ. పరీక్ష పాసైనప్పుడు, మాతో పాటు తన ఫోటో పత్రికల్లో, టీ.వీ.లో చూసుకొని ఎంత సంబర పడ్డాడో?" సుందరం కళ్లల్లో వెలుగు!

సూర్యం, చంద్రమౌళి, భరణి, సుందరం, నగరంలోని ఓ మగవారి హాస్టల్ లో సహచరులు. వేరు వేరు ఊళ్లనుండి, భిన్న నేపథ్యాల్లోంచి వచ్చిన వారు, రెండు సంవత్సరాలుగా ఏవో ఉద్యోగాలు చేస్తూ సివిల్స్ కి ప్రిపేరౌతున్నారు. తమ మాతృభాష తెలుగులో ఐ.ఏ.ఎస్. పరీక్ష రాయాలనుకోవడం వారిని కలిపింది.

ఒకే హాస్టల్ లోకి చేర్చింది. "కుటుంబంలో నాన్న పాత్ర" అనే అంశంపై చర్చిస్తూ, వారు తమ, తమ అనుభవాలు పంచుకుంటున్నారు.

"మా నాన్న ఇంటికి పెద్ద. నాకు ముగ్గురు బాబాయిలు, నలుగురు అత్తయ్యలు. మా తాతయ్య జిల్లా కేంద్రంలో కిరాణా కొట్టు నడిపేవాడు. అంత పెద్ద కుటుంబానికి ఆ సంపాదన గొర్రె తోక బెత్తెడు మందంగానే ఉండేది. చదువుకుంటూనే మానాన్న, మాతాతకు కొట్టులో చేదోడు వాదోడుగా ఉండేవాడు. అప్పుడు ఉద్యోగాలకు ఇంత పోటీ లేకపోవడంతో, మా నాన్న ఇంటర్ పాసవగానే అదృష్టవశాత్తు ప్రభుత్వోద్యోగం వరించింది. అందులో చేరి పీ.జీ. దాకా ప్రైవేటుగా చదివి, డిపార్ట్ మెంటల్ పరీక్షలు పాసై, అంచెలంచెలుగా పదోన్నతులు పొందారు. మా బాబాయిల, అత్తయ్యల

చదువులు అన్నీ మా నాన్న కష్టార్జితంతోనే పూర్తయ్యాయి. అంతేకాదు, మా అత్తయ్యల పెళ్లిళ్ళయ్యేదాకా, నాన్న గారు పెళ్ళి చేసుకోలేదు. బాబాయిలు రెక్కలొచ్చింతర్వాత, వారి దారి వారు చూసుకుంటే, నాన్నగారే మా తాతయ్యగారి పిల్లల భారం వహించారు. తాను మైనం వత్తిలా కరిగిపోతూ మా

కుటుంబానికి వెలుగునిచ్చారు. ఆస్తులేమీ కూడబెట్టకపోయినా, మాకు ఏ లోటూ లేకుండా పెంచారు నాన్న. సాధారణంగా మగవారు 'అమ్మకూచి' అంటారు కాని, నేను మాత్రం 'నాన్న కూచి'నే." సూర్యం తన నాన్న జీవిత రేఖా చిత్రాన్ని మిత్రులముందు ఉంచాడు.

"నా అనుభవం నీ దానికి విరుద్ధం. నా దృష్టిలో మా నాన్న ఓ విలన్. అదృష్టవశాత్తు నాకు పన్నెండేళ్లప్పుడే కాలేయం పాడవడంతో పైకి పోయాడు కాని, ఇప్పటిదాకా ఉంటేనా? నేనే అతన్ని చంపే వాడినేమో? అంత అక్కసు నాకు మా నాన్నపై. మా అమ్మ ఎన్నో అగచాట్లుపడి, నన్ను, చెల్లిని డిగ్రీదాకా చదివించింది. మా చెల్లి మనసునర్థం చేసుకొని, తను ప్రేమించిన అబ్బాయి పూర్వపరాలు తెలుసుకొని,

తృప్తిచెంది, వారి పెళ్లి చేసింది. నేను మాత్రం సివిల్స్ తేల్చుకుంటేగాని పెళ్ళి చేసుకోనని మా అమ్మకు చెప్పేశాను." చంద్రమౌళి తన నేపథ్యం ఆధారంగా కుటుంబంలో తండ్రి పాత్రపై తన అభిప్రాయం వెలిబుచ్చాడు.

భరణి చెప్పిందాని ప్రకారం, కుటుంబంలో అతని తండ్రిది ప్రేక్షక పాత్ర. అతని బాధ్యత సంపాదన మట్టుకే. మిగతా కుటుంబ వ్యవహారాలన్నీ వారి అమ్మే చక్కబెట్టేది. ఒక విధంగా భరణి తండ్రి స్థితప్రజ్ఞుడు. అతను ఆధ్యాత్మిక ధోరణిలో సాగుతూ, ఇహలోక విషయాలను అంతగా పట్టించుకునేవాడు

కాదు. అందుకని భరణికి అతని తండ్రి పట్ల ఏ భావమూ లేదు. అందుకే తన తండ్రి 'నిండుకుండ' అన్నాడతను.

ఇక సుందరం తండ్రి ధర్మయ్య విషయానికి వస్తే, తొలుత సైకిల్ రిక్షా తొక్కిన అతను, కాలానుగుణంగా ఆటో రిక్షా డ్రైవర్ అవతారమెత్తాడు. ధర్మయ్య గారి తండ్రి సగటు సైకిల్ రిక్షా కూలి. సకలగుణాభిరాముడు. సాధారణంగా రిక్షాతొక్కేవాళ్లకుండే అన్ని అలవాట్లూ అతనికుండేవి. తాగి తందనాలాడే రకం. తండ్రితో, తన తల్లి పడ్డ అగచాట్లు ప్రత్యక్షంగా చూసిన ధర్మయ్య, జన్మలో సారా

ముట్టుకోకూడదని ఒట్టు పెట్టుకున్నాడు. తోటివారు గేలిచేసినా లెక్కచేయక తానేమో, తన ఆటో రిక్షానేమో అని రాత్రింబగలు కష్టపడి తన పిల్లల్ని ఉన్నత చదువులు చదివించాడు.

ఆ నలుగురు మిత్రుల చర్చలో తేలిందేమంటే, తొమ్మిది నెలలు తన కడుపులో మోసిన అమ్మలందరూ సాధారణంగా మమకారమయమై ఉంటారు. తమ పిల్లల కు అప్యాయానురాగాలు పంచుతారు. అదే తండ్రులు మాత్రం, అందరూ ఒకే రకంగా ఉండరు. వారి వారి నేపథ్యాలనిబట్టి భార్యాపిల్లల పట్ల వారిప్రవర్తన మారుతూ ఉంటుందీ అని.



-అంబల్ల జనార్దన్
8850349858

## వేగుచుక్క నీవు!!

మరోసాయుధ స్వరాజ్య పోరాటాన్ని
ఆవిష్కరించి, ఆనాడే పరిష్కారానికి
సన్నద్ధులనుజేసి సంస్కరించిన
వేగుచుక్క నీవు!

అనంతమైన ఆత్మస్థైర్యాన్ని నింపుకొని
వేలాదిమంది మామూలు గుండెల్లో
వేకువ చుక్కలు మొలిపించిన
వెన్నెలమ్మ నీవు!

మహిళామణులలో స్ఫూర్తినింపి
మనిషిలోని దాహార్తి రగిలించిన
మహారాణి మణికర్ణికకు సమానమైన
గుండెధైర్యం నీవు!

మనసుల్లో ఆసక్తిని తట్టిలేపి
గుండెల్లో మడమతిప్పని పసరు పోసి
ముష్కర మేఘాలపై మెరుపై గర్జించిన
మహోన్నతశక్తివి నీవు!

మృధువచన స్వేచ్ఛా కునుకువు నీవు
మలితరానికి స్వాతిచినుకు నీవు
అమానవీయ శక్తులకు అడ్డుకట్ట నీవు
అశాంతి వ్రేళ్ళను పెకిలించిన ఆయుధం నీవు!

మేలిముత్యపు ఆలోచనల స్వేతవర్ణం నీవు
మేరుపర్వత ఆవేదనల స్వేదబింధువు నీవు
మార్పును మగ్గంపై వడికిన మార్గదర్శి నీవు
మహిళల్లో మౌనాన్ని మేల్కొల్పిన శిరోమణి నీవు!

బరితెగించిన వారికి బరిసెవు నీవు
గడప దాటిన వారికి విల్లువు నీవు
బాధ్యత మరిచిన వారికి భద్రకాళివి నీవు
మమతల కోవెలనీవు!
మాతృసమానురాలివి నీవు!

(నీ త్యాగాన్ని పట్టించుకోని వారిని ప్రశ్నించే ధైర్యాన్ని, స్పందించేతత్వాన్ని మాలో నింపుమని మనోవేదనతో అర్పిస్తున్న మా కన్నీళ్ళ శ్రద్ధాంజలిని మనసుతో దాచుకొని మమ్మాశీర్వదించమ్మా! మల్లు స్వరాజ్యమ్మ!)



-డా॥ దువ్వల రాజేశ్
9440460490



# సాయుధ పోరాటంలో తుపాకీ పట్టిన మొదటి మహిళ

### -మల్లు స్వరాజ్యం మృతి సామాజిక ఉద్యమానికి తీరని లోటు

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం హైదరాబాద్ చికిత్స పొందుతు మరణించడం బాధాకరం. తెలంగాణ సాయుధ పోరాటంలో తుపాకీపట్టిన మొదటి మహిళా మల్లు స్వరాజ్యం .తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు స్వాతంత్ర సమరయోధురాలు మల్లుస్వరాజ్యం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో కరివిరాల కొత్తగూడెం గ్రామంలో భూస్వామి కుటుంబంలో భీమిరెడ్డి రామిరెడ్డి చుక్కమ్మ దంపతులకు 1931లో జన్మించారు. వీరిది వందలాది ఎకరాల భూమి ఉన్న భూస్వాముల కుటుంబం 1946 47వ సంవత్సరంలో స్వరాజ్యం ఇంటిని నైజాం గుండాలు తగులబెట్టారు.తెలంగాణ సాయుధ పోరాటంలో నైజాం సర్కారునుగడగడలాడించిన వీర వనిత ధైర్యంగా ముందుకు సాగి సాయుధ పోరాటానికిసమర్థవంతమైన నాయకత్వాన్ని అందించింది.. స్వరాజ్యం సాయుధ పోరాటంలో అదిలాబాద్ వరంగల్ కరీంనగర్ జిల్లాలో పనిచేశారు. నాడు దొరల దురహంకారాన్ని పాటలు ద్వారా ప్రజలను చైతన్య పరిచారు.మహిళా కమాండర్‌గ పనిఛేశారు. నైజాం ప్రభుత్వంమల్లు స్వరాజ్యం ను పట్టిస్తే పదివేల రూపాయల బహుమతిని ప్రకటించింది. ఆంధ్ర మహాసభ పిలుపుతో తన పొలంలో పండిన వరి ధాన్యాన్ని పేదలకు పంచిపెట్టారు. వీరి భర్త మల్లు వెంకట నరసింహారెడ్డి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యునిగా కొనసాగారు. వీరి సోదరులు భీంరెడ్డి నరశిమరెడ్డి మిర్యాలగూడ పార్లమెంట్ నుండి రెండుసార్లు ఎంపీగా గెలుపొందారు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ లో ఎమ్మెల్యేగా పనిచేశారు 1978 నుండి 1983 వరకు ఎమ్మెల్యేగా సిపిఎం పార్టీ తరపున పనిచేశారు . అసెంబ్లీలో పేదల అభివృద్ధి సంక్షేమం కోసం రూపొందించబడిన చట్టాల బిల్లుల మీద నిర్మాణాత్మక చర్చలు చేశారు

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘాలకు రాష్ట్ర జాతీయ స్థాయిలో పనిచేసిన నాయకురాలు. మద్యపానం నిషేధం ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. మహిళా ఉద్యమం మహిళల హక్కులు మహిళల సాధికారిత కొరకు నిరంతరం పోరాడిన గొప్ప మహిళ నాయకురాలు మల్లు స్వరాజ్యం మృతి తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు.నేటి యువతమహిళా సంఘాలు పౌర సమాజం మల్లు స్వరాజ్యం ఆశయాల సాధనకు కృషి చెయడమే నిజమైన నివాళి..



-నేదునూరి కనకయ్య
రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం,సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక. 9440245771.

## తన మాటే తుపాకీ తూట

ఆయుధం పట్టిన ధీర 'మల్లు'
బడుగు బలహీనుల 'స్వరాజ్యం'
తన మాటలే తుపాకీ తూటాలు
పౌరుషం పారించిన మహాశక్తి !

నిజాంల మదిలో సింహస్వప్నం
వెట్టిచాకిరినే వెలేసిన వనిత
జమీందార్లనే ఎదిరించి దుర్గ
రజాకార్లపై రంకెసిన ఖడ్గం !

పిడికిలి బిగించిన గళ గర్జన
వీర తెలంగాణ ఝాన్సీ రాణి
తెలంగాణ తుపాకీకే నేస్తం
పేదోడి కాలు ముళ్లు తీసే మల్లు !

సాయుధ పోరాట స్వరాజ్యం
మచ్చలేని విప్లవ మణి పూస
అలుపెరుగని సబల కామ్రేడ్
ఉక్కు సంకల్ప పోరు ధీరత్వం !

పార్థివ దేహమూ పరహితమే
అమరత్వమే కదా ఆమె జీవితం
యువతరానికే తనో దీప స్తంభం
తన రుధిరమె అరుణ పతాకం
లాల్ సలాం మల్లు స్వరాజ్యం !



-మధుపాలీ
9949700037

## వివేక వాణి




# కొత్త కవులకు మార్గదర్శి "దిక్సూచి"-ప్రముఖ సినీ గేయ రచయిత భువనచంద్ర

"ఒక కవి ఓ గ్రంథాన్ని వెలువరించడమంటె తల్లి ప్రసవ వేదనలాంటిదే"అన్నారు ప్రసిద్ధ సినీ గేయ రచయిత భువనచంద్ర.ఉదయసాహితి హుస్నాబాద్ ఆధ్వర్యంలో శ్రీదాస్యం లక్ష్మయ్య సభాధ్యక్షతన ఆది వారం రోజున మధ్యాహ్నం జూమ్ అంతర్జాలవేదికపై నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రముఖ కవి, రచయిత విమర్శకులు దాస్యం సేనాధిపతి గారు రచించిన "దిక్సూచి" వచన కవిత కరదీపికను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడ "తూ"కొత్తగా కవిత్వం రాస్తున్న కవులకు ఈ గ్రంథం మార్గదర్శకంగా నిలుస్తుంద"ని అన్నారు.విశిష్ట అతిథి, కరీంనగర్ జిల్లా అదనపు పాలనాధికారి జి.వి.శ్యాం ప్రసాద్ లాల్ మాట్లాడుతూ "దిక్సూచి ప్రతి గ్రంథా లయంలో ఉండవలసిన గ్రంథమ"ని అన్నారు."దిక్సూచి కవిత్వం ఎలా ఉండాలో తెలిపే సంక్షిప్త గ్రంథమ"ని శాతవాహన యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి ఆచార్య కడారు వీరారెడ్డి అన్నారు.మరోవిశిష్ట అతిథి ప్రముఖ సినీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్ మాట్లాడుతూ" మానవ జీవనయానంలో కవిత్వం ఒక ఇంధనమని, "దిక్సూచి"కొత్త తరానికి దిశా నిర్దేశం చేస్తుందని "అన్నారు." నేటి నిజం సంపాదకులు బైస దేవదాస్ గారు వీడియో సందేశం ద్వారా అభినందనలు తెలిపారు.గ్రంథాన్ని ప్రముఖ కవయిత్రి ముద్దు వెంకటలక్ష్మి పరిచయం చేసారు. కార్యక్రమంలో సాహితీ గౌతమి కార్యదర్శి గాజుల రవీందర్, ఉదయసాహితి అధ్యక్షులు వైరాగ్యం ప్రభాకర్, పత్తిపాటి రూపలత,సావిత్రి రంజోల్కర్, రాయవరపు సూర్యప్రకాశరావు,ఎర్రం రాజారెడ్డి తదితర కవులు పాల్గొన్నారు.



## ప్రతిక్రియ

దయాదీపాన్ని నీలో నిరంతరం వెలిగించినా..
నియమం తప్పి పంట చేలను పాడుచేసే
ఆబోతుల్లాంటి దర్పాంధులకు గుణపాఠపు ముకుతాడు వేసి
లొంగదీయడమూ అనివార్యమని గ్రహించు!

సత్యరూప దైవాన్ని మనసున సదా నిలిపినా..
నిత్యం అల్లిబిల్లి అల్లికల్తో బోల్తా కొట్టించే
ఊసరవెల్లుల్లాంటి వంచకుల్ని నిజం నీటితో కడిగి
నిగ్గుదేల్చి సిగ్గు దీయడమూ తప్పనిసరని భావించు!

మంచిదనపు గంధాన్ని మానవధర్మంగా అందరికీ పంచినా..
ఇంచుకైనా మానవత్వం లేక దారి తప్పి ఘీంకరించే
మదపు టేనుగుల్లాంటి అహంకారుల్ని తక్షణమే గుర్తించి
అదుపు అంకుశంతో దారికి తేవడమే కర్తవ్యమని విశ్వసించు!

సహనపు చెలిమి చేతినెన్నడూ వీడనెంచకున్నా
అసహనంతో బుసలు కొడ్తూ విచక్షణ లేక కాటేసే
విషపురుగుల్లాంటి మానవ రూపుల్ని తటాల్న పట్టి బంధించి
కోరలు పీకి దునుమాడడమే ఏకైక మార్గమని నమ్మకముంచు!

అహింసా మార్గాన్నెన్నుకోవడం దైవీ లక్షణమైనా..
హింసకే పట్టంగట్టి విధ్వంసానికి కట్టుబడి ఉండే
రక్కసి గణాల్లాంటి దుష్టుల్ని భుజబలంతో అణచి
శాంతి వెన్నెల కురిపించడమే కర్తవ్యంగా స్వీకరించు!
క్రియకి ప్రతిక్రియ యుగయుగాల ధర్మమనే
ఎరుకతో వ్యవహరించు!



– ఎస్. కాశింబి
సెల్: 9052216044

## నానోలు

అమ్మ
ప్రేమ
నాన్న
దీమ.

మార్చేది
పుస్తకం
ఏమార్చేది
మస్తకం.

మాట
భూషణం
ఆట
విభూషణం.

పని
చెమట
గని
ముచ్చెమట

నడక
గమ్యం
తడక
అయోమయం

ఆట
ధైర్యం
మాట
మనోధైర్యం

–తాండ్ర చిరంజీవి
9959280762

# అక్షరాలతో అభిషేకం ..భరతమాతకు అక్షరాంజలి"







శ్రీ గౌతమేశ్వర సేవ కళా సంస్థ మంథని వారు ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా నిర్వహించిన పోటీలలో కొన్ని కవితలను స్వీకరించి భరతమాతకు అక్షరాంజలి పేరుతో కవితా సంకలనాన్ని తీసుకురావడం ముదావహం. ఈ సంస్థ ద్వారా ప్రచురించబడిన మూడవ సంకలనం. గతంలో నవరస కవితాఝురి మరియు సప్తవర్ణ కవనమంజరి ద్వారా ఎందరో యువ కవులను ప్రోత్సహించారు. ఈ సంస్థ ద్వారా మరెందరో సృజనకారులను తీర్చిదిద్దారు. కవితా సంకలనాలు వెలువరించి వర్ధమాన కవులను, ఇప్పుడిప్పుడే రాస్తున్న కొత్త కవులను ప్రోత్సహిస్తూ ముందుకు నడుస్తున్న శ్రీ గౌతమేశ్వర సాహితీ సేవ కళా సంస్థ అధ్యక్ష కార్యదర్శులు శ్రీ దూడ పాక శ్రీధర్ మరియు యస్వీ. ఆర్. వెంకటేశం గారు అభినందనీయులు.

కవిత్వం లోకి ప్రవేశిస్తే "వివిధ భాషా సంస్కృతుల నిలయం– త్యాగధనుల త్యాగఫలం– పాడిపంటలతో అలరారే నా దేశం" అని ఆరెకటిక నాగేశ్వర రావు గారు భారతదేశాన్ని కీర్తించారు. తమ కవిత "మచ్చుతునక"లో "మన త్రివర్ణ పతాకం ఆత్మగౌరవానికి ప్రతీక ధర్మానికి మచ్చుతునక"యని జాతీయ జెండా గౌరవాన్ని ద్విగుణీకృతం చేశారు కోట లక్ష్మణ్ గారు. దేశమంతా ఒక్క తాటిమీద నిలబడి,ఒక్క మాట మీద నిలబడి దేశం కోసం ప్రాణం పెట్టిన అల్లూరి,ఝాన్సీ, భగత్ సింగ్, ఆజాద్,అంబేద్కర్, సర్దార్, గాంధీ, నెహ్రూ లాంటి గొప్ప వ్యక్తులను స్మరించుకున్నారు.

లోడే రాములు గారు తమ కవిత "వందేమాతరం" లో స్వాతంత్ర్యం కోసం గ్రామాలన్నీ సంగ్రామాల నిలయాలై ఆయుధాలు పట్టని యుద్ధం మొదలైంది. జైల్లో పెట్టినా, పిట్టల్ని కాల్చినట్లు కాల్చినా, జన ప్రభంజనం ఆగలేదు" అంటూ స్వాతంత్ర్య పోరాటాన్ని మన కళ్ళ ముందు ఉంచారు. వనం సావిత్రి గారు "వేద భూమిరా మనదేశం సకల కళలకు కాణాచి" అంటూ దేశ గొప్పతనాన్ని పొగిడారు. కే.ఉమ గారు "ఘన చరిత్ర గల భారతం" పేరుతో కవితలో "అన్ని దేశాలకు ఆదర్శం మన కట్టుబొట్టు– సంస్కృతి సాంప్రదాయాలకు పుట్టినిల్లు" అంటూ మన సాంప్రదాయాన్ని సంస్కృతిని ఉటంకించారు. మాసం శీను గారు తమ కవితలో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులను స్మరిస్తూ ఎంతోమంది త్యాగ వీరుల పుణ్య ఫలితమే స్వాతంత్ర్యమ"ని తన భావాన్ని వెలిబుచ్చారు. మన నేటి స్వేచ్ఛకే మూలం బలం బంధం మంచికి నివాసం మనదేశమంటారు పురం మంగ గారు . ఐక్యతారాగంతో ఏకమై ఐకమత్యమే మహా బలమని తలచి స్వాతంత్ర ఆకాంక్ష భావావేశం విలసిల్లిందని తత్ఫలితమే స్వాతంత్ర్య ఫలమని''వరాంకుశం రఘునారాయణ గారు వివరించారు. సర్వశ్రీ లికిత గారు భారతదేశంలో భారతదేశం తత్వాన్ని వివరిస్తూ "హిందూ ముస్లిం భాయ్ భాయ్ భిన్నత్వంలో ఏకత్వమై ప్రజలంతా ఏకమైన భారతీయులం మనమ"ని దేశానికి చాటి చెప్పారు. ఆళ్ల నాగేశ్వరరావు గారు "విశ్వ మణిదీపం ప్రదీప్తిస్తున్న దేశం నా భారతదేశం" అంటారు. తాడితోటి జాన్ కిరణ్ బాబు గారు భారతదేశాన్ని "సస్యశ్యామల పరిమళ శోభితమైనది"గా భావించారు. పోతుగంటి వీరాచారి గారు మువ్వన్నెల జెండా గురించి వర్ణిస్తూ "భారతావని హృదయం నిండా నిండు కున్న మువ్వన్నెల జండా గురించి విశదపరిచారు. మోతిలాల్ ఆరెకటిక గారు స్వాతంత్ర వీరులను దేశభక్తులను జ్ఞాపకం చేసుకుంటూ భారతీయునిగా తన జన్మ ధన్యమైందని విశదపరిచారు.

కాసుల ధీరాజ శర్మగారు స్వాతంత్రం సాధించిన భారతదేశంలో స్వార్థపు ఛాయలకు తిలోదకాలు నైతిక విలువలు శుభ తరుణాలని" ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. జి నిర్మల దేవి గారు ''త్యాగమూర్తుల ఫలితంగా వచ్చిన స్వాతంత్ర్యాన్ని అభివర్ణించగా సింగడి శోభారాణి గారు "మువ్వన్నెల జెండా అంతరార్థాన్ని వివరిస్తూ "అందరు మేలుకు ఒకరు– ఒకరు మేలుకై అందరూ నడవాలని" బోధించారు. మీసాల సుధాకర్ గారు భారత జనని వందనం అంటూ అభివందనం చేయగా జి వి కుమార్ చేపూరి గారు "నా దేశం విశ్వ విజేత– సతత హరితం సస్యశ్యామలం" అంటూ భారతదేశం స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న దేశభక్తులను స్మరించు కున్నారు. పుల్లూరు సాయిప్రియ గారు "స్వాతంత్రం దేశానికి కానీ ప్రజలకు కాదు అంటూ నా దేశంలో ఏదో వెలితి ఉందంటూ నేటి పరిస్థితులను మన ముందుంచారు'' త్రిలోచన బిసాయి గారు "కీర్తి భారతమ"ని భారతదేశాన్ని అభివర్ణించగా దుర్గా ప్రసాద్ గారు "తిరగబడ్డ సమరయోధులు" కవితలో ''స్వాతంత్ర్యవీరులను గుర్తుకు తెచ్చుకున్నారు.డాక్టర్ మంగమార లక్ష్మి గారు స్వాతంత్ర్య సంగ్రామం గురించి వివరించగా వేణుగోపాల్ రావు గారు "స్వతంత్ర భారతమా వందనం"అంటూ జేజేలు పలికారు. సతీష్ అంగిరేకుల గారు స్వాతంత్ర్య పోరాటాన్ని "మొక్కవోని సంకల్ప దీక్ష"గా వివరించగా "జాతీయ సమైక్యతను మత సామరస్య తాడుపై ఆర వేయాలని ఉంది" అంటూ తన ఆలోచనల్ని మనతో పంచుకున్నారు అరసవిల్లి మోహన్ రావు గారు. ఎందరో త్యాగధనుల ఆత్మబలిదానంగా నా దేశమాత బానిస సంకెళ్ళు తెగిన రోజు" అంటూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు తురుమెళ్ళ కళ్యాణి గారు. "జననీ జన్మభూమి నీకు శిరసానమామి" కవిత ద్వారా ''మాకు దేశభక్తిని ప్రసాదించమ''ని భరతమాతను కోరుతున్నారు. కవితా సంకలనం సంపాదకులు దూడపాక శ్రీధర్ గారు దేశం యొక్క ఔన్నత్యాన్ని గొప్పతనాన్ని చక్కని పదాలతో "నా తల్లి భారతదేశం" అంటూ "ఆధ్యాత్మికతకు నిలయం–లలిత కళలకు పుట్టినిల్లు–సకల భాషలకును మెట్టినిల్లుగా–ఎన్నో వింతలకు ఆనవాలు నా దేశమ"ని దేశం యొక్క గొప్పతనాన్ని మన ముందుంచే ప్రయత్నం చేశారు. ఈ విధంగా కవితా సంకలనం లోని ప్రతి కవి కవయిత్రి స్వాతంత్ర పోరాట సంఘటనలు,స్వాతంత్ర పోరాట వీరులు, మరియు స్వేచ్ఛావాయువులు పీలుస్తున్న నేటి భారతదేశ పరిస్థితిని వివరిస్తూ భరతమాతకు అక్షరాంజలి సమర్పించారు తమ దేశభక్తిని చాటుకున్నారు ఈ సంకలనంలో కవితలు రాసిన ప్రతి కవి, కవయిత్రికి అభినందనలు

పతులకు: దూడపాక శ్రీధర్
గ్రామం: కూచిరాజ్ పల్లి
మండలం: మంథని
పెద్దపల్లి జిల్లా 505184
చరవాణి : 9666375277



–వైరాగ్యం ప్రభాకర్
9014559059

## మారణ హోమం

నాలో రగిలే ఈ ఆవేదన
ఏమని వివరించను ,
లోలోతున జరిగే ఈ సంఘర్షణ
ఎలా విన్నవించను ....
ఆ యుద్ధభూమిని తలచి,
అక్కడి పరిస్థితి తెలిసి,
చెలించని మనసుందా ..?
కంటతడి పెట్టని మనిషున్నాడా ...?

మనిషి... సాటి మనిషిపై
అధిపత్యం అనాగరికం
అన్న రాజనీతి... నేడు కనుమరుగయ్యే....
దేశం... పొరుగు దేశాన్ని
ఆక్రమించ రణరంగం తప్పదాయె..

చంటిపాపలకు నిలువ నీడ లేదు,
తల్లితండ్రుల జాడ లేదు,
క్షణక్షణం ప్రాణభయం,
రణభూమాయే
గర్భిణీల పురుడుస్థలం.....

భార్యబిడ్డల విడిచి
మారణాయుధాలు చేత పట్టి
దేశపోరాటమే కర్తవ్యమైన వేళ ....
కుటుంబాలకి ఆధారం
ఆ కొడుకులే కడతేరగా.....
కన్నీటి వీడ్కోలు పలుకుతూ,
ఇక ఈ జన్మకు సెలవు...
అని కన్న వారికి
కడుపుకోత మిగిల్చే ఈ దుస్థితి...

ఎప్పుడు వస్తావు నాన్న,
అన్న ప్రశ్నకు సమాధానం తెలియక
ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని
యుద్ధానికేగే ఆ తండ్రి మనోఘోష

మనుషులే మృగాలై
సాటి మనుషుల్ని హతమార్చు వేళ .....
దేశమే స్మశానమాయే ,
శవాలపై పరిపాలనకా...!
ఇంతటి వైపరిత్యం ఏమి సాధించేను?
ఏ దారి చూపేను
ఈ మారణహోమం...?
ఇలాంటి లోకంలో ......
ఏ మనిషి ప్రశాంతంగా నిదురించగలడు,
ఏ భరోసాతో బ్రతుకీడ్చగలడు ....
ఏంతటి దౌర్భాగ్యం ,
ఇంత ప్రగతి సాధించిన ఈ మానవాలికి,
కనీస మానవ హక్కులపై
గౌరవం పోయేనే ....
సాటి మనుషులుగా
మన కర్తవ్యం ఏమని తలచిన,
ఏమీ తోచక గుండెలు బరువెక్క,
మనసు విచ్చిన్నం ఆయేనే..
ఈ మారణ హోమం
ఆపేది ఎవరు...?



–కోనం హిమబిందు

## స్మశాన నిశ్శబ్దం

ప్రశాంత సాగరంలో అలలు అందమే
అందమైన జీవితాలను
అల్లకల్లోలం చేస్తున్నది యుద్ధం
బలవంతుడు బలహీనుడిని
ఆక్రమించడం జంతునీతి
ఒకరిపై ఒకరు పైచేయి సాధించాలని
అధికార దాహం కోసం జరిగే విధ్వంసమే
యుద్ధం ఒకప్పుడు
చతురంగ బలాలతో సాగేది
విజ్ఞానం పెరిగిన తరువాత
తుపాకీలు సాధనాలైనాయి
సాంకేతికత పెరిగి విమానాలు
క్షిపణులు మరఫిరంగులు
అణబాంబులు యుద్ధ ఆయుధాలయినాయి
జడపదార్థమైన భవనాలనే కాదు
వేలకొలది జనజీవనాన్ని అస్తవ్యస్తంచేసి
బతుకులను అంధకారమయం చేసింది
యుద్ధం
బిడ్డలను కోల్పోయిన తల్లిదండ్రుల దుఃఖం
అనాథలైన పసిపిల్లల రోదనలు
విరామం దొరికితే చాలు
తలదాచుకునేందుకు
ప్రాణాలు నిలుపుకునేందుకు
పరుగులు పెడుతున్నారు సామాన్య జనం
ఆవులు ఆవులు తన్నుకుంటే
లేగల కాళ్ళు విరిగాయి అన్నది సామెత
కానీ ఇది తథ్యం పునః పునఃసత్యం
ఒక్కసారి తల వెనక్కి తిప్పి చూస్తే
శవాలగుట్టలతో
రక్తసిక్తమైన నేలలు కనిపిస్తాయి
యుద్ధం ఎవరికి ఏమి మిగిల్చింది
అశాంతి రోదన అంతంకాని ఆవేదనతప్ప
ఆధిపత్యం దక్కినా అక్కడ మిగిలేది శూన్యం
స్మశాన నిశ్శబ్దమే రాజ్య మేలుతుంది
యుద్ధాలను సమర్థించకండి
శాంతిని ఆకాంక్షించండి.



–డా.మైలవరపు
లలితకుమారి
9959510422

## నిశ్శబ్దాలు శబ్దం చేస్తాయ్

జనం తలెత్తుతున్నారు
వీధులు తిరగబడుతున్నాయ్
నిశ్శబ్దాలు శబ్దం చేస్తున్నాయ్
దిక్కులు దద్దరిల్లుతున్నాయ్
నింగినంటిన నిరసన జ్వాలలు
రాజకీయ మతకుట్రలపై
భగ్గున మండుతున్నాయ్
జనం ఎపుడూ ...ఓడిపోరు
జనం ఎపుడూ ....సమిధలు కారు
శబ్దం దిక్కును వెతుక్కుంటున్నది
దిక్కులన్నీ. దిక్షుచి లవుతున్నయ్
వీచే గాలెపుడూ హాయినివ్వదు
సముద్ర కెరటాలని ఆకాశానంటిస్తాయ్.
తూరుపు ఒకటే నని భ్రమించకు
జనాలను వేరు చేసే మాట వచ్చినప్పుడల్లా
అన్ని దిక్కులు సల సల మండే
తూరుపులవుతాయ్.
వీధులు తిరగబడుతున్నాయంటే
తూరుపులు తెల్లారాడానికి దిక్సూచి
నిశ్శబ్దం శబ్దమయ్యిందంటే
చైతన్య ప్రవాహం
చుట్టు ముట్టే ప్రభంజనం.
ఎన్నాళ్ళని ప్రజలను వేటాడతారు
ఇంకా ఎన్నాళ్ళని
మనసులను గాయం చేస్తారు
ఇపుడు వేటా మాదే ఉద్యమ గేయం మాదే
ఇప్పుడు ఎరుపెక్కిన తూరుపు మాదే
మేమిపుడు
ఉదయించిన సూర్యులం
మండుతున్న అగ్నిగోళాలం



–సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

పుస్తక సమీక్ష

# హాయిగా చదువుకోదగిన కథానికలు "అవ్వ"

డా॥ పెరుకరాజు రచించిన 'అవ్వ' కథల సంపుటిలో 15 కథలున్నాయి. ఏ రచయిత రచించినా వారి వారి కథల్లో వస్తువు, కథనం, శిల్పం ఉంటుంది. ఏ కథకుడైనా సమాజంలోని సమస్యల్నే వస్తువులుగా ఎన్నుకుంటారు. కాకుంటే ప్రతి వస్తువును ఎలా మలిచారన్న మాటమీదే ఏ కథైనా నిలబడుతుంది. కాకుంటే ఇలాంటి వాటిని అంటే వాస్తవమైన విషయాల్ని విపులీకరించిన వాటిని కథానికలు అంటారు. ఊహాతీతమైన వాటిని మాత్రమే కథలు అంటారని ప్రముఖ కథా రచయిత వేదగిరి రాంబాబు గారు అనేవారు. కనుక మొదటగా ఈ పెరుక రాజు గారు రచించినవి కథానికలు అని అంటాను.

వీరు రచించిన రెండవ కథానికల సంపుటి ఇది. ఈ కథలన్నీ వివిధ పత్రికలలో అచ్చయినవే.. ఈ రచయిత రచించిన కథానికలన్నీ కొత్తదనాన్ని సంతరించుకున్నాయి. చదివేందుకు అనువుగా ఉన్నాయి. మనిషిలోని ఎదుటి మనిషికి చెప్పుకోలేనంత పెద్దవి కావు అలాగని భరించేటంతటి చిన్నవి కావు వంటి విషయాల్ని కథానికల్లోనికి జొప్పించి చూపడం ఎంతో ఆలోచింపజేసేవిగా ఉన్నాయి. మనిషి చాలా సునిశితంగా ఆలోచిస్తే తప్ప ఇలాంటి విషయాలు దొరకవు. ఉదాహరణకి ఈ సంపుటి శీర్షిక "అవ్వ" కథానికలో రోజంతా పనిచేసి అలసిపోయిన అవ్వ తన కొడుకుతో ఇంటికి ప్రయాణం అవుతుంది. దారిలో కొడుకు ఆకలిని గుర్తించి మిరపకాయ బజ్జీలు కొనిస్తుంది. తన పరిస్థితిని కొడుకుకు కనిపించనీయకుండా తనకున్న డబ్బులో కొనిచ్చి కొడుకు ముఖంలో ఆనందాన్ని చూసే తల్లిగా చిత్రీకరించిన తీరు ఇందులో కనిపిస్తుంది. కథ ఇంతే చాలా చిన్నది. కానీ ఇందులోని భావం ఎంతో గొప్పదని తెలియజెప్పే తీరు బావుంది.

కథైనా, కథానిక అయినా ఇన్ని పేజీలు మాత్రమే ఉండాలని అనుకుంటే అది రచయితకి సంతృప్తిని ఇవ్వదు. కార్డు కథ నుండి పది పేజీల పెద్ద కథ దాకా రచయిత ఆకాంక్షమేరకు సాగాలి అనేది నిజం. బహుశా మన విజ్ఞతకు పదును పెట్టాలనేమో కొందరు పేజీలను నిర్ణయిస్తారు. జరిగిన విషయాన్ని పదిపేజీలు చెప్పచ్చు లేదా పది లైన్లలో కూడా చెప్పవచ్చు అనే విషయాన్ని ఈ రచయిత పెరుకరాజు గారు ఈ





సంపుటిలో నిరూపించారనే చెప్పాలి. ఇలాంటి కథానికే మరొకటి

"సెల్యూట్" ఒకచోట పెళ్ళి అవుతూ ఉంటుంది అదీ చాలా గ్రాండ్‌గా. భోజనాలు మాత్రం సంప్రదాయ బద్ధంగా అరిటాకుల్లో వడ్డిస్తుంటారు. అందరూ భోజనం చేసిన తర్వాత ఆఖరున పెళ్ళి వారికి అత్యంత ఆత్మీయుడైన ఒక వ్యక్తి భోజనానికి కూర్చుంటూ ఇదేంటి మీరంతా స్కూల్ యూనిఫాంలో ఉన్నారు అంటాడు ఆశ్చర్యంగా. అందుకు సమాధానంగా వీరంతా స్కూలు, కాలేజీ పిల్లలే. సెలవు రోజున ఇలా వచ్చి తమకు తోచిన పనుల్ని చేస్తూ తల్లి తండ్రులకు ఖర్చులను మిగులుస్తుంటారు. ఇంకా వీలు చిక్కినప్పుడల్లా వృద్ధాశ్రమాలకు వెళ్ళి స్వచ్ఛభారత్ పనులు చేస్తూ శ్రమదానం చేస్తారు అనే విషయం విని ఆ సదరు స్నేహితుడు ఆశ్చర్యపోతూ వారికి సెల్యూట్ చేస్తాడు. ఇంతే కథానిక. ఇలాంటిదే మరో కథానికను పలకరిద్దాం. పేరు "చూడు" ఒక పిల్లవాడు ఏడుస్తుంటాడు. ఆ వైపుగా వెళుతున్న ఒకామె "ఎందుకు బిడ్డా ఏడుస్తున్నావు? ఆకలా అంటే కాదంటాడు. కష్టాలు మనకు కాకుంటే ఎవరికొస్తాయి బిడ్డా.. ఏడవకు అని ఓదార్చుతుంది. కాస్సేపటికి ఆ పిల్లవాడు తన బాధలు చెప్పుకుంటాడు. తన తండ్రి అప్పుల పాలయ్యాడని, తినడానికి తిండి కూడా కరువైందని, ఉన్న డబ్బు అంతా అక్కల పెండ్లిళ్లకే ఖర్చయిందని, తాను మస్కట్ పోయి సంపాదిద్దామనుకుంటే డబ్బు చాలటం లేదని, వయసు సరిపోలేదని వీసా రావడానికి ఆలస్యమవుతోందని అందుకే పట్నమైనా పోయి పని చూసుకుందామని తన తండ్రితో పాటు వెళ్లిపోతున్నానని చెప్పడం పూర్తి కాగానే తండ్రి ఆటో తీసుకుని రావడం, ప్రయాణం అవ్వడం జరిగిపోతుంది. ఇంతే..

ఇలాగే విషయాన్ని సాగతీయకుండా ఒక విషయాన్ని విపులీకరించడం ఎంతో కొత్తగా అనిపించింది. కథయినా. కవితయినా మన ఆలోచనల్ని అనుసరించే కదులుతాయి. మన భావాలే అందులో దాదాపుగా కనిపిస్తాయి. మరొక్క కథను వివరిస్తాను. పేరు "ఎన్నో చేయవచ్చు" విమల అనే అమ్మాయి మాటి మాటికీ పదో తరగతి ఫెయిల్ అవుతూ ఉంటుంది. తాను పనిచేసే చోట యజమానురాలితో "అమ్మా నేను పదో తరగతి పాస్ అవ్వకపోతే నేను బతకలేనా?" అని అడుగుతుంది. అదేమీ లేదు. మనం ఎలాగైనా బతకచ్చు, కుట్టు పని నేర్చుకోవచ్చు. బ్యూటీపార్లర్ కోర్సు నేర్చుకోవచ్చు. ఇంకా పచ్చళ్ళ తయారీ ఇలా అనేకం ఉన్నాయి అనగానే విమలకు బ్యూటీపార్లర్ పై మనసుపడి కష్టపడి ఆ కోర్సు చేసుకుని సెటిలయిపోతుంది. అంతా అయ్యాక విమలా నువ్వు ఇంక నా ఇంట్లో పనిచేయకు. బ్యూటీపార్లర్‌లో ఉంటూ ఈ పని నీకెందుకులే అంటుంది. అది విన్న విమల నది పుట్టిన స్థానాన్ని వదలదు అమ్మా.. అలాగే నేను మిమ్మల్ని వదులుకోలేను అంటుంది" ఇదీ కథానిక.

ఇలాంటివి మరెన్నో కథలు రాంబాబు పశ్చాత్తాపం,బడాఖాన,ఆదికి వచ్చే , పిటిపరేడ్ , చంద్రన్న, ముసలమ్మ, వంటి కథానికలు చాలా క్లుప్తంగా విషయం మాత్రం చెప్పే తీరులో సాగాయి. ఈ కథానికల్లో పెద్ద పెద్ద మలుపులు, వేదనలు, ఘోషలు, అన్యాయాలు ఏమీ లేవు. చిన్న కష్టాలు వాటిని తీర్చే మార్గం అనే తీరులో సాగాయి. అందరూ హాయిగా చదువుకోదగిన కథానికలు ఇవి. రచయిత పెరుకరాజు గారికి అభినందనలు..

–ప్రతులకు:
డా॥ పెరుకరాజు
ఫోన్: 7810032847



–శైలజామిత్ర
9290900879

## శాంతి సందేశం

ఓ...కోకిలా !!
రష్యా రంకెలెస్తుంటే
ఉక్రేయిన్ ఊసురుమంటుంది
కమ్మనైన పాట పాడేనీవు
రాగాన్ని కోల్పోయి
మూగదానివై..మూల్గుతున్నావా..?
కూసుంటే సమస్య పరిష్కారం కాదా ?
బిక్కుబిక్కు మంటున్న ప్రజల బాధ పోదా ?
ఇద్దరనుకుంటే యుద్ధం ఆగదా ?
స్నేహం కొనసాగదా ?

నా సందేశాన్ని కోకిలతో పంపుతున్న
విని తరించండి
సరిగా ఆలోచించండి
యుద్ధమాగుటకు
సరైన నిర్ణయంబు సేయండి

" కలసి వుంటే కలదు సుఖం "
అన్నారు పెద్దలు
వారు చెప్పిరి ఎన్నో సుద్దులు
వారి నుంచి నేర్వాలి మంచి బుద్దులు
లేనిచో పడతవి మాటల గుద్దులు

యుద్ధమంటే...
ప్రాణ నష్టం
పంట నష్టం
ఆస్తి నష్టం
ఆహారకొరత ఏర్పడడం
భూమి సమతుల్యం కోల్పోవడం
వాతావరణం కాలుష్యమవడం
" పెట్టుబడులు ? పెంట పాలు
బ్రతికున్నవాడి జీవితం ? నీటి పాలు "

అహంకారం వుంటే అణచుకోవాలి గాని
సమస్యను జటిలం చేయడం కాదు
ప్రజలను ఇబ్బంది పెట్టడం కాదు
అలా ప్రవర్తిస్తే శాంతి చేకూరదు
కారే ప్రతికన్నీటికి లెక్కుంటుంది
వెనక్కు తగ్గకుంటే
పర్యవసానం మీకుంటుంది
కాలం తన పని తాను చేసుకుపోతుంది
చేతులు జోడించి మిమ్మల్ని అడుగుతున్న
తలవంచి ప్రాధేయపడుతున్న
నా హృదయం గాయమౌతున్న
నా కన్నీళ్ళు నిప్పుల సెగలై కారుతున్న
యుద్ధానికి చరమగీతం పాడండి
స్నేహానికి దారి చూపండి
శాంతిని చేకూర్చండి
అడ్డుగోడలు పెకిలించి
కలిసి ముందుకు సాగండి

ఈ" చిరు" సందేశం కావాలి కనువిప్పు
తేవాలి మనిషిలో మార్పు !!

–తాండ్ర చిరంజీవి
9959180762.

## యుద్ధమంటే.....!

తూటాల శబ్దం పేలిపుడు
రాకెట్ లాంచర్లు విసిరినప్పుడు
బాంబుల మోతలు మోగినప్పుడు
కనబడి వినబడే ముచ్చట్లతో
యుద్ధమంటే సంతోషమే ఉంటుంది.

పెద్ద పెద్ద భవంతులు కూలినప్పుడు
విమానాల నుండి ఔషధాలు పడినప్పుడు
అణ్వాయుధాల ప్రయోగమన్నప్పుడు
నగరాలను చుట్టుముట్టి ఆక్రమించినప్పుడు
రోమాలు నిక్కబొడిచే క్షణాలన్ని
యుద్ధమంటే పరమానందమే ఉంటుంది.

కానీ!
భయంతో జనాలు పరిగెత్తినప్పుడు
దేహమంతా చిల్లులు పడ్డప్పుడు
గోడల కింద కబేళాలు దొరికినప్పుడు
రక్తపు మడుగులో అవయవాలు
చెల్లాచెదురైనప్పుడు
ఆర్తనాదాల రోధనను కండ్లారా చూసినప్పుడు
యుద్ధమంటే ఉన్మాదమనిపిస్తుంది.

పిల్లా జల్లలు చెట్టు గుట్టల పాలైనప్పుడు
బంకర్లలో జనాలు దాగినప్పుడు
చిన్నారులే రైఫిల్స్ పట్టినప్పుడు
అధినేతలే ఎదురొడ్డి పోరాడినప్పుడు
బాంబుల వర్షానికి అర్థమేముంది
ఆక్రమించుకున్న విజయం
గొప్పదేలా అవుతుంది.

యుద్ధం ఎవరికోసం చేయాలి
గుండెలపై తూట ఎవరి కోసం పేల్చాలి
మనిషిని మనిషి చంపుకునేది
యుద్ధమేలా అవుతుంది
ప్రసరించే ఉషస్సును ఆపతరమా
ఆక్రమించిన చోట
ఆయుష్షు పోయుట సాధ్యమౌనా.

యుద్ధమంటే సంబరమే
గెలిచిన గర్వం అంబరమే
మరి! రణస్థలిలోని శవాల కుప్పలకు
బాధ్యులెవరు
రక్తపుటేరులంచున శిక్షించేదెవరిని
విరిగిన మనసుల అతికించేదెవరు
అందుకే! యుద్ధమంటే మరణశాసనం
పీడ కలల సాక్షాత్కారం



–ఉండ్రాళ్ళ రాజేశం
9966946084

## హృదయవిదారకం....

వేళ్ళూనిన దురహంకారం
అధికారదాహంతో
దురాక్రమణ తలపెడుతూ....
మరోదేశాన్ని కూకటివేళ్ళతో
పెకిలించ సిద్ధమైంది....

పేట్రేగుతున్న ఉన్మాదపు ఆలోచనలపర్వం....
ఉరుములగర్జనను మించిన ధ్వనులతో....
ముప్పేట బాంబుదాడులు జరిపి
ఊళ్ళన్నీ ఖాళీచేయిస్తున్నది....

వరుసదాడుల పరంపరలో....
వయసుడగకముందే రక్తపు ముద్దలవుతున్న
సైనికకాయాలెన్నో.....
ప్రాణభయంతో ఉన్నపళంగా
పరుగులుతీస్తున్న
అమాయకప్రాణాలెన్నో....

వెనకడుగేయని ఇరురాజ్యాల మొండివైఖరి...
పాపభీతిని మరిచి కార్చిచ్చునే రగులుస్తుంటే....
ప్రాంతాలన్ని శ్మశానవాటికలవుతున్నాయి
బూడిదై మిగులుతూ....

స్థలాలన్ని రక్తసిక్తప్రవాహాలతో
స్నానమాడుతున్నాయి
మారణహోమపు గురుతులు చూపిస్తూ...
భయానక శబ్దాలతో విరుచుకుపడ్డ
ఉత్పాతం పిదప ఏముంటుందిప్పుడు....?
మాడినదేహాల మరకలు తప్ప..
కూలిన భవనశికలాల దిబ్బలు తప్ప...

కట్టలుతెగే కన్నీటికి ఆలవాలమైన..
హృదయవిదారక దృశ్యాలను చూసాకైనా...
కనువిప్పు కలిగేనా మరి...

దానవత్వదారులలో పరుగులు పెడుతున్న
పాలకులకు ....
మానవత్వాన్నే మరచి హింసాకాండతో
చెలరేగుతున్న రాక్షసులకు...



–స్వప్నకృష్ణ
9440536669

## అన్ని తానై..

మగువ గొప్పదనాన్ని
వర్ణించ అవధులు లేవు
ఇంట్లో పుట్టింది మొదలు
ఆమె ఆ ఇంటికే వెలుగు,
కాళ్ల గజ్జల సవ్వడిని జూసి,
మురిసిపోయే తండ్రి,
అన్నింట్లో చేయూతనిచ్చే,
తోడు జూసుకొనీ గర్వంగా నవ్వే తల్లి,
పనికి వన్నె తెచ్చే చురుకుతనం జూసి,
పండుగనే వచ్చిందని
మురిసే తాత నాయన్నమ్మలు,
ఇంటికొచ్చిన మనిషిని చిరునవ్వుతో స్వాగతిస్తే,
పులకరించిపోయి దీవించే ఊరి జనం,
ఆ ఇంటికి అలంకారమే ఆమె నవ్వు,
ఎవరికి ఆపదొచ్చిన ఆగలేదు ఆ ఆమని,
ఇంటి దీపాన్ని మెట్టింటికి పంపాలంటే,
ఊరంతా కన్నీటి ధారలతో కట్టేసింది,
రాబోయే తరాని కోసం
తన ప్రాణం లెక్కజేయక,
పురిటినొప్పుల గండాన్ని
ఎదురుకున్న వీరనారి,
సృష్టికే జీవం పోసే
అమృతవల్లి ఆ తల్లి
ఓ! స్త్రీ నీ త్యాగానికి లేదు
ఏది సాటి...

–పల్లె రాజుగౌడ్
9666207288

## ఎక్కడుంది సామ్యవాదం..?

నిరుపేదల పిల్లలు..
బతుకుకై పోరాటము..
ధనవంతుల పిల్లలు..
బడికొరకై ఆరాటము..
ఏమిటిది భారతమ్మ..
ఎక్కువ తక్కువలెందుకమ్మా..

బడికెల్లె వయసులోన..
బాధ్యతలను మోస్తుండెను..
బడికోయె పిల్లల చూసి..
బాధతో కుములుతుండెను..
అయ్యయ్యో బాలలార..
చదువులమ్మకు దూరమైతిరా..

అక్షరాలు దిద్దుకుంటు..
ఆడుకునే వాళ్ళు మీరు..
తోటోళ్లను చూసుకుంటు..
తల్లడిల్లుతున్నరు..
ఎందుకింత ఘోరము..
పేదవాడిగా పుట్టడమేనా..

రాజ్యాంగమందులోనా...
రాసి ఉండెను హక్కులు..
రాత పూతలు నేర్చుకొని..
మార్చుకోండి బతుకులు..
చదువుకోండి బాలలు..
చక్కగుండును భవితలు..



–పసుల.శంకర్
9542181301

## వాళ్లూ మనుషులే!

వాళ్లూ మనుషులే
రెప్పవాల్చని రాత్రిళ్లు
వాచ్మెన్ డ్యూటీ చేయాలి
పొద్దు మొలిచేంత వరకు
కాలం కాటేయనంత వరకు–

వాళ్లూ.. మనుషులే
ఉదయాన్నే మహరాజుల లోగిళ్లను
ఊడ్చి ఊడ్చి ముస్తాబు చేయాలి
ఒంట్లో సత్తువ వున్నంత వరకు
దొంగతనం నేరం మోయనంత వరకు–

వాళ్లూ మనుషులే
కణకణమండే నిప్పుల కొలిమిలో
పగలూ రాత్రీ పరిశ్రమించాలి
నగరాల బిగువ సడలే వరకు
కార్మికుడి కట్టె కాలనంత వరకు–

వాళ్లూ మనుషులే
వేకువనే భుజాన నాగలితో
పొలంలో చెమటలు చిందించాలి
పొద్దు గుంకేంత వరకు
కడుపాశ చావనంత వరకు–



–పేరూరు బాలసుబ్రహ్మణ్యం
సెల్: 98492 24162

## ఎండ

అన్ని కాలాలతోనూ చెలిమి చేస్తావు
నీ కాలం రాగానే ఎగిసిపడుతావు
వసంత రుతువు రాగానే
నీ మనసంత పులకరించెను
తరువులు కొత్త వస్త్రాలను ధరించి
ముస్తాబయ్యేను
చల్లని గాడ్పులలో
సతమతమవుతున్న ప్రపంచానికి
వెన్నెల లాంటి
వెలుగు నిచ్చి వెచ్చదనం కురిపించేదవు
కండ్లకు కనిపించవు కాని
కవ్విస్తూ ఉంటావు
బయటకు రాగానే నీ ఒడిలో మమ్ములను
బందీలను చేసి
చెమటలు కక్కిస్తూంటావు
వేడినీళ్ళ స్థానాన్ని చేపిస్తుంటావు
పట్టపగలు పాములా బుస కొడుతుంటావు
మిట్టమధ్యాహ్నం ఉడుకుతున్న అన్నంలా!
వడగండ్ల వాన వలే చప్పరిస్తుంటావు
చల్లని గాలుల ను సైతం
వడగాలి గా మార్చేస్తావు
తనువునంతా రుబ్బురోలువలే
పిండి పిండి చేస్తావు
సాయంత్రం కాగానే చల్లబడి
చంద్రుని వెన్నెలలో
సేద దీరుతుంటావు
భానుని కిరణాలతో మొలకెత్తి నాలుగు
మాసాలలోనూ వామనుని మించి
అవతారమెత్తి
నాట్యంచేస్తూ నరులను
ఇబ్బంది పెడుతుంటావు
మండుతున్న అగ్నిజ్వాలలా
ఎండవై ఎగిసి పడుతుంటావు
హిమగిరి శిఖరాన్ని సైతం
నీరులామార్చేస్తుంటావు.



–యం.ఉసేందర్
6281109466

## తేటతెలుగు.. తేనెచినుకు

ఓంకార నాదమై మమకార బీజమై
మనసులనల్లుకున్న అజంతా భాష!
భావాల మిళితమై బంధాల సాక్షమై
ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ గా వినుతికెక్కిన భాష!!

అచ్చులు హల్లులతో అణువణువు అలరగా
సంధి సమాసాలతో తనువంతా మెరవగా
ఛందస్సు చందనమే మేనిపై పూతగా
అలంకార భూషణాలే కంఠాన కాంతులీనగా

అమ్మపాల అమృతమే దేహమై నిలవగా
గుమ్మపాల నురగలే ఉల్లమంత పొంగగా
కవిపుంగవుల కలములోన కవనమై దూరగా
పండితుల గళములో పద్యమై పారగా
తేట తెలుగు భాష తేనె చినుకు నా భాష!

చాటువులే పాటవమై యాసలే ప్రాసలై
పదాలే పరవశించగా పాటలై ప్రవహించగా
వ్యాసమై వర్ధిల్లగా కథలే వీనులవిందుగా
యాబదారు అక్షర సొగసుల సుందరకావ్యం
వేల యేండ్ల నా భాష వేనోళ్ళ నా తెలుగుభాష

మాతృభాష మకరందం మనమంతా గ్రోలగా
నేటితరానికి వారసత్వంగా అందించగా
సజీవమై నాభాష విజయకేతనమెగరేయదా!



–అయిత అనిత
8985348424

## పాఠం - గుణపాఠం

జలం నిశ్చలమైతేనే
దర్పణమై దర్శనమిస్తుంది
మనసు నిర్మలమైతేనే
పున్నమై ప్రదర్శనమిస్తుంది
నిన్నునిన్నుగా ప్రేమించే మనిషి
నీకళ్ళ ముందున్నపుడు
గమ్యానికే ఆటంకమొచ్చినా
గెలుపునకే అవరోధమొచ్చినా
జీవితానికే అంతరాయమొచ్చినా
మనసులేకమై నడుచుకొంటే
ఏ బెరికెనైనా నిర్మొహమాటంగా
పరిగె ఏరివేయడమే పరిణతి !

గతాన్ని మరువకుంటూ
గతిని మార్చుకుంటూ
ప్రగతిని జల్లెడపడుతూ
భవిష్యత్ మనుగడకు
వ్యక్తిత్వ అనుమతితో
అస్తిత్వ పరిమితిని
ఆదరిస్తూ ఆచరించడమే
ఆ మాతృమూర్తి వంశానికిచ్చే
అమూల్యమైన బహుమతి !.

అంతేగాని ...
హోదానే లక్ష్యమని తిరిగినా
డబ్బే ముఖ్యమని పెరిగినా
లోకమే పరివారమనుకున్నా
పొక్కిలిచేసే స్నేహాల చాటున
పొంతనలేని పొగడ్తల మధ్య
మానవత్వం ఏమాత్రం మరిచినా
సత్యానికి దూరమై , అబద్ధాలతో అల్లుకపోతే
మనశ్శాంతి మాయమై ,
విలువ కొండచిలువై
జీవిత రహదారిలో ఎటువెళ్ళినా
దారి దొరకక చివరకు
ఇగురాన్ని మరిచిన ఇరుకుదారిలో
అనామకులై అధోగతి కాకతప్పదు !
ఇదే జీవన గమనానికి
పాఠం – గుణపాఠం !



–డా॥. డి. రాజేశ్
9440460490

## హైకూలు

నీలి మేఘాలు
ముచ్చటించుకున్నాయి
ఆకాశ వీధిలో

చెట్లు జతగా
సేద తీరుతున్నాయి
సూర్యాస్తమయం

సరిహద్దులో
ఉదయించే సూర్యుడు
వీర జవాను

తొలి అడుగు
నాన్న చేయి పట్టుకుని
తీపి జ్ఞాపకం



–కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

## పరాజయం

ఓపిక
నేర్పు
దీపం
ఓదార్పు
కన్ను
దర్శనం
మిన్ను
దైవదర్శనం

–తాండ్ర చిరంజీవి
9959280762.

## ముఖ చిత్రం

నా కున్న ఆ రెండు కళ్ళు
మా ఊరికున్న నీళ్ళ చెలిమెలు
నా నుదుటి మీద మెరిసే బొట్టు అది
మా ఊరిని ఆదుకునే
జోగినాథుడనే ఆపద్బాంధవు
నా శిరస్సుపైన నిలిచిన శిఖరం
అది మా ఊరి నడిబొడ్డున
నిలబడిన మద్దిరంగం
నా కున్న రెండు చేతులు
అరచేతులను చాపే మా ఊరికి
ఇరువైపుల ఉన్న మర్రిచెట్లు
నా కున్న రెండు కాళ్లు
మా ఊరి పిల్ల కాలువలకు
నిజమైన ఆనవాళ్ళు
నా మదిలో రూపుదిద్దుకున్న
అందమైన చిత్రం
అది మా ఊరి
అద్దంలో మెరిసే
నా ముఖచిత్రం!!



–ఎస్. జవేరియా
9849931255

## వెలుగు బాటలు... గ్రంథాలయాలు

సకల శాస్త్రాలకు
సాంకేతిక విజ్ఞానానికి
వెన్నెముకగా నిలుస్తూ
జ్ఞాన సముపార్జనకు
తోడ్పడే ప్రధాన రహదారులు !
విద్య విజ్ఞానానికి
ఆసరాగా నిలుస్తూ
మస్తకాలను కదిలించే
పుస్తకాల పునాదులతో
పరిణతి చెందిన
సమాజాన్ని నిర్మించే
నిర్మాణాలయాలు !
వ్యక్తి శీలసంపదను
సంస్కారాన్ని వ్యక్తిత్వాన్ని
రూపొందిస్తూ
ప్రజలందరికీ సమాన
అవకాశాలను కల్పించే
ఏకైక ప్రవర్తనాలయాలు !
సకల కళలకు
వివిధ శాస్త్రాలకు
సాహిత్య ప్రక్రియలకు
సంబంధించిన గ్రంథాలతో
మెదడుకు మేతపెట్టే
సార్వజనీన శాశ్వత
స్వయం శిక్షణాలయాలు !
పిల్లల కోసం బాలసాహిత్యం
వృద్ధులకు పురాణసాహిత్యం
అందరి కోసం ఆధునిక
సాహిత్యం తో ఊతమిస్తూ ...
ప్రజల జీవన విధానాన్ని
మార్చే ఆదర్శ నిలయాలు !
ప్రముఖుల అనుభవాలు
సుప్రసిద్ధుల జీవిత గమ్యాలు
దేశభక్తుల స్వీయ చరిత్రలతో
జన మేధస్సును
ఒక తాటిపైకి
తెచ్చే చైతన్యాలయాలు !
ఆదర్శవంతమైన సమాజాన్ని
నిర్మించుకునేందుకు
సేవాతత్పరతను
నిలుపుకునేందుకు
విమోచన ఉద్యమం
జాతీయ ఉద్యమం
ఏ ఉద్యమాల కైనా
ఆదర్శంగా నిలిచిన
అధ్యయనాలయాలు !
పాఠకుల మానసిక వికాసానికి
ఉపయోగపడుతూ
ఇష్టా గోష్టిలతో ...
ప్రయోజనకర సదస్సులతో
సమాలోచనలు చేయడానికై
చోటు కల్పించే
ఆశ్రమాలయాలు !
మరి . .మరి . .
ఈ కంప్యూటర్ యుగంలో
గ్రంథాలయాలు
కనుమరుగు కాకుండా
అంతర్జాలములో
అంతర్ధానం కాకుండా
గ్రంథాలయాల పరిరక్షణకు
కదలాలి
భవితకు మార్గదర్శకులు
అవ్వాలి !
జై గ్రంథాలయం ..
జై జై గ్రంథాలయం !!



-రవి చంచల
860330700

## నానీలు

పల్లె
గుండె
అవ్వ
గోస

గాజుకళ్లు
గారపళ్లు
చుట్ట
అవ్వ

నేను
మంచె
అవ్వ
కాపలి

అవ్వ
బొక్కలకట్టె
బరువు
పొయ్యిలకట్ట

చుట్ట
పొగలు
నవ్వులు
రింగులు

పటేన్లు
పెద్దిల్లు
అవ్వ
పెంకుటిల్లు

కోమటి
గిరాకీ
అప్పు
అవ్వ

అవ్వ
కట్టె
పల్లె
మట్టి

తరాలు
మూడు
ముసలవ్వ
ఈడు.

-సి. శ్రీధర్
9493122742

## వేయికళ్ళ ఒత్తులు

జీవిత నావ...
సవ్యంగా పయనించాలంటే...

ముందు చూపు గల
ముందస్తు ప్రణాళికా రచన
అత్యంత ఆవశ్యకం...

ఇళ్ళైనా ... దేశమైనా ...
నాలుగు చక్రాలు సవ్యంగా తిరిగే
సుఖ జీవిత సాకారంకై
ఆర్థిక నియంత్రణా
తంత్రాన్నాచరించవలసిందే...!

చిటారు కొమ్మన మిఠాయి పొట్లమై
ఊరించే బడ్జెట్ పత్రం గుట్టు విప్పినప్పుడే...
దానిలోని తీపిదనమెంతో
చవి చూడగలిగేది...

పొందిన బహుమతి విలువ
పొట్లం విప్పితేనే తేటతెల్లమయినట్లు...

చర్విత చర్వణమై
ఏటేటా అందేటి బడ్జెట్ కానుక...
కొందిరికి మోదమొసగి...
కొందరికి ఖేదం పంచుతుంది!

దేశ ప్రగతి రథం నడకననుసరిస్తూ
వేసుకునే ప్రజల ప్రణాళికలు
కొన్ని ఆశలను ఆ ఏటికి బజ్జుండపెట్టి
ఈ సారికి తామూహించని
కొత్త రెక్కలను కట్టుకుంటుంటాయి...

ఏటేటా సాగేటి వాయిదా పర్వంలో
కొన్ని కోరికలు
బలవంతపు అణిచివేతకు గురవుతుంటే...
తప్పనిసరై
ఈ ఏటి అరుచినలవాటు చేసుకున్నా...
మనసు మాత్రం...
మరుసటేడైనా తీపి
మధువులు అందివస్తాయని
వేయికళ్ళ ఒత్తులను వెలిగించి
వేచి ఉంటుంది!

-వెగ్గలం ఉషశ్రీ
9440370066

## కలం మెరుపులు

చక్కని రాతలకు
అడ్రస్సు కలం
చదువుతుంటే మనసుకు
రాతలిచ్చును బలం !!

నిగ్గుతేల్చు కలం
పదునైన కత్తిరా
పోరాడు కలం
వెలిగించు వొత్తిరా !!

కవితలల్లుటకు కలములున్నది
చిక్కనైన ఇంకు
పట్టుకుంటే అదిసన్నది
గుండెకోయు పెంకు !!

కలమునుండి వచ్చును
మనసులోని మాటలే
మనిషిలో మార్పుతెచ్చును
కవితల తూటాలే !!

కారు ప్రయోజకులే
కలంపట్టిన వారందరు
వర్షించు అక్షరాలచినుకులే
ఆస్వాధించును కొందరు !!

పాటకు ప్రాణంపోయు
ఆలోచించే కలం
అందరికి మంచిచేయు
దివ్యౌషధ రాతలిచ్చుకలం !!

కమనీయ రాతలు
కలంనుండి వచ్చును
మేలుగాంచు రాతలు
చదివిన తృప్తినిచ్చును !!

పట్టుకున్న కలం
పనికిరాకుండపోదు
సిరాయున్న కలం
" సీటు" ఇవ్వకుండపోదు !!

కలము ఆయుధమే
అద్భుతరచనలకు మూలం
రాతలు అమృతమే
మనసుకువేయును గాలం !!

చిద్రమైనజీవితాల అతుకు
చిన్నదైన కలం
రాతజీవమిచ్చు మెతుకు
అదేప్పటికి మనకుబలం !!



-తాండ్ర చిరంజీవి
9959180762.

## మానవతను పరిమళిస్తూ...

నిన్న మన ముంగిట మురిపెంగా
పెరిగి ఎదిగి చదువుల రెక్కలతో
ఎగిరివచ్చి ఇక్కడ వాలిన చిట్టి తల్లులు
నేడు అన్నీ తామై అంతటా నిలిచి
పరాయిదేశంలో పరుగులజీవితాన
ఆరిందానిలా నిలిచిన మన పిల్లల్ని
చూస్తుంటే నిన్నటి మొలకలు నిండుగా
పెరిగిన మహావృక్షాల్లా కనిపిస్తున్నారు!

అందంగా సౌఖ్యంగా కనిపించే
ఇక్కడి బ్రతుకులలో దూరపు
కొండలు నునుపు చందంలా
ఒకచేతిలో స్టీరింగ్ మరోచేతిలో
కంప్యూటర్ తో కుస్తీలు పడుతూ
ఇంటిపని, 'ఇంటినుండిపని'తో
పిల్లలసంరక్షణ చేస్తూ కాపురాన్ని
సర్కస్ తాడుమీద సమతూకపు
నడకతో సాగుతున్న జీవనం!

ఐదురోజుల ఊపిరిసలపని దినచర్య
ముగిస్తే దొరికే రెండ్రోజుల
సెలవులో తిరిగి మొదలయ్యే
సోమవారం బూచీ కోసం
సిద్ధమవటంలోనే
రెండురాత్రులు తెలియకనే
ఆవిరవుతాయి !

అమ్మానాన్నలు, తోబుట్టువులు, ఆప్తులు
గుర్తుకొస్తే గుండెలోని ఆర్తిని
ఎడబాటును దాచుకుంటూ
అంతా బాగానే ఉందంటూ
అందరినీ సంతోషపరచి తనుమాత్రం
ఒంటరిగా మిగిలిపోతుంది
అన్నీ తానే అయిన జీవన
సహచరుడు తనలాగే
ఊపిరిసలపని వత్తిడిలో
యంత్రమై సాగుతుంటే
అయినవారికి దూరంగా డాలర్
స్వప్నాలవేటలో వలసపక్షులైవచ్చి
మేడిపండు జీవితంతో
రోజులు గడిపే స్థితికి లోలోన
కుమిలిపోతూ మిగులుతున్నారు!

అవకాశాల దేశమని సంపాదన మెండని
మేధోవలస వచ్చినా వదులుకోలేని
కుల వాసన, మతం రొచ్చు, ప్రాంతీయ తత్వం
ఇక్కడా ఊరేగుతూ ముఠాల
రూపంలో మురుగుతున్నారు
మేధోశ్రమకిక్కడ ప్రతిఫలమెక్కువ
దక్కినా మెరుగైన కూలీ బ్రతుకుల
దశ మారని వ్యవస్థ ఎక్కడైనా!

నలుపు తెలుపు అంతరాలుండని
సమాజం కోసం పిడికిలి ఎత్తి
జనశక్తిని కదంతొక్కించిన అమరుడు
మార్టిన్ లూథర్ కింగ్
రక్తం చిందించిన నేలలో
దేశం వేరైనా జెండా ఏదైనా
మనిషితనంమరవక మానవతను
పరిమళిస్తూ విశ్వప్రేమ కేతనాన్ని
ఎగరేయని బ్రతుకులెందుకు ?
(పరదేశంలో పరుగుల
జీవితపు వత్తిడిలో
మన పిల్లలను చూసి)



-డా. కె. దివాకరా చారి,
9391018972

## మంచితనమే మేలోయ్...!

అవివేకమిలనుతమస్సు
సద్వివేకమే ఉషస్సు
సదా సద్వివేకమె కన
జీవితాన కదె తపస్సు!

చెడ్డగుణముచూడ చెరుపు
మంచి గుణమేనిలమెరుపు
చెడుకు చరమ గీత మేను
పాడితేనె మనకె మలుపు!

మంచినడతనుమానకుము
చెడు దారిలో నడవకుము
మంచిచెడులగ్రహించియు
పదుగురికి సేవ సల్పుము!

ఎవరికి చేయకు ద్రోహము
వీడుము పరస్త్రీ మోహము
బాధలెన్ని ఎదురొచ్చిన
నీ భవిష్యత్తుకు యోగము!

పరధనము మహాపాపము
వలదు సజ్జనుల కోపము
పర ధార ధనాదులకై..
వెంపర్లాడితే శాపము!

నీతితో బ్రతుకే బ్రతుకు
ఖ్యాతితో బ్రతుకే బ్రతుకు
కలకాలము హంసలాగ
మంచిగుంటేనే బ్రతుకు!!



-డా.గన్నోజు శ్రీనివాసాచారి
8555899493

## పెరుగుతాము

చిట్టి చిట్టి తమ్ముడూ
అమ్మా నాన్న లకు
ముద్దులు ముచ్చట్లు
మురిపాలు పెంచుదాము!

అక్కా అక్కా నా
చక్కని చుక్కా
పాలూ నీరల్లే మనం
కలగలిసి వుందాము !

అన్నా అన్నా నా
రామ చంద్రమా
పాలలో వెన్నలా మనం
కలగలిసి ఉందాము !

అమ్మా నాన్నా నేను
మేమందరమూ
కలిసి చల్లగ తెల్లగ
తోడుగా పెరుగు తాము!
హాయి హాయిగా వుంటాము!!



-ఎల్.రాజా గణేష్,
9247483700

కరోనా కథలు

## 'కొత్త కోణం"

(కథ)

అప్పుడే లాక్‌డౌన్ విధించి రెండు నెలలు దాటింది. కంటికి కనబడని కరోనా కనిపించిన వారినల్లా కసిగా కాటేస్తున్నది. ఈ వైరస్‌కు అమీరుగరీబు, నీఛాఉఛ్ఛా, తారతమ్యాలు అసలే లేవు. కుల, మత, వర్గ, దేశ, ప్రాంత లింగ విబేధాలు లేకుండా మానవాళి నందరినీ అతులాకుతలం చేస్తున్నది.

ఇక అట్టడుగు వర్గాల విషయమైతే చెప్ప తరం కాదు. వందల వేల మైళ్ల దూరం నుండి పొట్ట చేత బట్టుకొని బతకడానికి నగరాలకు వచ్చిన వలస జీవుల దీనగాథలు వింటుంటే, టీవీల్లో చూస్తుంటే ఎంతటి కఠినాత్ములైన కరిగిపోవాల్సిందే. చేసుకోవటానికి పని దొరకక, కూలీ లేక, కడుపుకు పట్టెడన్నం లేక ఆకలితో అలమటించిపోతున్న అబాల గోపాలం ఆరాటం చూస్తుంటే కంటనీరు పెట్టని వారుండరు.

పనీ పాటా కరువై చేతిలో చిల్లిగవ్వ లేక దిక్కు తోచక వేల మైళ్ల దూరంలో ఉన్న తమ స్వస్థలాలకు వెళ్లటానికి ఏ రవాణా సౌకర్యాలు లేక కాలినడకన లక్షలాది మంది అభాగ్యులు తిరుగు ప్రయాణం చేస్తున్నారు.ఆ ప్రయాణంలో జరుగుతున్న సంఘటనల దీనగాథలు ఎన్నో.

ఆలూమగలూ పనికెళ్తే తమ చంటి పిల్లలను చూసుకోవటానికి వచ్చిన

> పనీ పాటా కరువై చేతిలో చిల్లిగవ్వ లేక దిక్కు తోచక వేల మైళ్ల దూరంలో ఉన్న తమ స్వస్థలాలకు వెళ్లటానికి ఏ రవాణా సౌకర్యాలు లేక కాలినడకన లక్షలాది మంది అభాగ్యులు తిరుగు ప్రయాణం చేస్తున్నారు.

తమ వృద్దులు, సోదర సోదరీమణులు, తనయులు, ఇలాఒక్కో కుటుంబం ఒక్కో తీరున యమయాతనలు, నగర శివార్లలోని గుడిసెల్లోనో, చెట్ల నీడనో, రోడ్ల పక్కనో ఇలా మరింకెచోటో ఎండా వానా చలిని తట్టుకొని కాలం వెళ్లబుచ్చే వారెందరో అలమటిస్తున్నారు.

ఇలా బతుకు నీడుస్తున్న వారంతా నేడు ఈ వైరస్ రక్కసి దెబ్బతో తమ బతుకు చిద్రమవ్వటంతో తమ స్వగ్రామాలకు రాత్రి పగలూ ఎండా వానకు, పురుగూ పుట్రను లెక్కచేయకుండా అలుపెరుగని తమ నడకను సాగిస్తూనే ఉన్నారు.

తమ యావదాస్తి ఒక మూటేదాన్ని నెత్తిన పెట్టుకుని వెళ్లేవారు తమ భవిష్యత్తుకు ఆధారమైన తమ పిల్లలను చంకనెత్తుకొని నడిచేవారు కొందరు, నడిచే ఓపికున్న పిల్లలు నడుస్తున్నారు. కాళ్లు కాలితే చెప్పులు లేక పాదాలకు గుడ్డలు, ఆకులు, కాగితాలు కట్టుకొని కొందరు, కావడి కట్టుకొని మోసుకెళ్తున్న వారు మరికొందరు, తమ కుటుంబీకులైన వృద్దులను ఓపికున్నంత వరకు మోసుకెళ్లటం, ఇలా పలు రకాలుగా తమ నడకను ముందుకు సాగిస్తూనే ఉన్నారు. పై నుండి ఎండ ధగధగలు కడుపులో ఆకలి మంటలు దీనికి తోడు దాహంతో అల్లాడిపోతున్న వారి ఆక్రందనలు చూసి హృదయాలు కదిలిపోయిన మా మిత్ర బృందం అందరం కలిసి ఒక కొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టాం.

వాస్తవంగా చెప్పాలంటే మాది జాతీయ రహదారికి పక్కనే గల ఓ మోస్తారుగా ఉన్న సాంపల్లి అనే ఊరు చూడటానికి ఊరు చిన్నదైనా కనీసం 20, 30 మందిమి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులమే. మా అందరికీ లక్షల్లోనే వేతనాలు మాలో చాలా మందికి ప్రపంచంలోని ఉన్నత కంపెనీల్లోనే ఉద్యోగాలు.

అయితే లీవులోనో మరింకే కారణాలో మా స్వస్థలాల కొచ్చిన వారందరం లాక్‌డౌన్ పుణ్యమా అని, మా ఊర్లోనే ఉండి వర్క్ ఫ్రం హోంతో ఇంటి పట్టునే ఉండిపోయాము. అప్పుడప్పుడు వాకింగ్‌కని అందరం ఉదయమో సాయంత్రమో ఒకచోట కలుసుకునే వాళ్లము.

అలా ఒక రోజు ఉదయం వేకువజామున రోడ్డు వెంబడి తండోపతండాలుగా జనం కాలినడకన వెళ్లటం గమనిచాం ఆయాసపడ్తూ, నిలువెళ్ల చెమటలతో ఒళ్లంతా తడిసి అలిసిపోయి ఆయాసపడుతూ నడుస్తున్నారు. కాళ్ల కాలి బొబ్బలొచ్చి ఆ మంటలకు తాళలేక రోదిస్తూ వెళుతున్న వారు ఇంకొందరు. ఇలా ఎవరిని చూసినా హృదయం ద్రవించిపోతుంది.

అలా వెళుతున్న వారిని మేమే పలకరించాం. మాలో ముందుగా మా సీనియర్ రఘు కల్పించుకుంటు "బాబూ! మీరెక్కడి నుండి వస్తున్నారు. ఏ ఊరికి వెళ్లాలి?" అని అడిగాడు.

దానికతను వచ్చీరాని తెలుగులో "నమస్తే సార్, మేడ్చల్ సే, హయే, అబ్ ఛత్తీస్‌ఘడ్ జానా హై" అన్నాడతను.

"అంత దూరం ఇలాగే పైదల్ (కాలినడకనే)"

"హా భయ్యా! ఇట్లనే.."

"ఈ పిల్లలూ, వృద్దులూ, పసి పిల్లలూ, బాలింతలూ, ఇలాగేనా?॥ అని విస్తుపోతూ అడిగాడు రఘు.

"అయ్యో! ఎంత ఘోరం.." అని నేనంటున్నంలో

"ఇంకా ఇదేం చూసింద్రు సార్.. మా బంధువులు కొందరు తమ పిల్లల్ని మోయలేక, వారికి తిండి పెట్టలేక, వారి గోస చూడలేక తోవలున్న ఊర్లలో అమ్మేసుకున్నారు" అని చెప్పాడు ఆ బాటసారి.

"అయ్యో! అమ్మేశారా?..." అని నేనంటుంటే..

"మేము కూడా ఇదిగో ఈ పిల్లల్ని అమ్మేద్దామనుకుంటున్నాం సాబ్. చాతగాని మా ముసలవ్వను మోయలేక, పిల్లఇన్ను మోయలేక వారికి ఇంత కూడు పెట్టలేక వదులుకోలేక నరకం అనుభవిస్తున్నాము.."

వారిలో నుండి ఓ వృద్ద మహిళ ముందుకొస్తూ "బాబయ్యా! మా తిప్పలు ఇంకెన్నాళ్లో, నిన్ననే మా ముసలోడు ఈ ఎండదెబ్బకు కాలం చేస్తే అటు రోడ్డవతల పారే సొచ్చినం" అని చెప్తుంటే..

"మేమొచ్చే తోవలో ఆకలి భరించలేక చచ్చిపోయిన కుక్కఉ పీక్కొని తిన్నదయ్యా! అయితే ఏం జెయ్యాల, ఒద్దురా బిడ్డా! మన ఊర్లోనే ఏదైనా కాయ కష్టం చేసుకొని బతుకుదాం అంటే వినక, పట్నం పోదం మస్తు సంపాదించుకో వచ్చని నా కొడుకు చెప్పితే వస్తిమి, గీయాల్ల గిట్టైపోతిమీ" మరొకావిడ ఏడవడం మొదలు పెట్టింది.

ఆమె దుఃఖం హృదయ విదారకంగా ఉంది. ఆమె అలా ఏడవటం ప్రారంభించగానే ఓ 20,30 మంది వరకున్న పిల్లా పాపలందరూ శోక రాగాలు తీశారు.

వారి స్థితిగతుల గురించి మేమలా ఆరా తీస్తున్నంతలోనే మా మిత్ర బృందం షామి యానాలు చేయించేశారు. అప్పటికీ ఉదయం ఎనిమిది గంటలు అయ్యుంటుంది. టీలూ టిఫిన్లు కూడా తయారు చేయించి అందరికీ వడ్డించేశాం.

అంతలోనే మరికొందరు వలసజీవులు కాలినడకన వస్తున్నారు. వారికి కూడా ఆహారం అందించాము. బహుశా అప్పుడు మధ్యాహ్నం ఒంటి గంట అయి ఉంటుంది. మధ్యాహ్న భోజనాలకు వంటలు కూడా సిద్ధం చేస్తున్నాం.

కొత్తగా వచ్చి చేరిన వారితో కూడా కొన్ని విషయాలు అడిగి తెలుసుకున్నాం. ఆ వచ్చిన వారిలో ఒక నడి వయస్సున్నతనితో మాట్లాడుతూ "అవును ఇన్ని రోజులుండి ఇప్పుడు వెళ్లటం ఏమిటీ?" అని ప్రశ్నిస్తే..

"సార్ రియలెస్టేట్‌లో మేస్త్రీ పని చేస్తాం నా పేరు యాదవ్.." నెల రోజులు ఓపిక పట్టి ఉండమంటే సరేలే అని అక్కడే ఉన్నాము. పనీ పాట లేక విసుగు చెంది వెళ్తామనే

> "మేరే భాయియో!" అని అందరినీ పిలుస్తూ "మనం మనుషులమై ఉండి కూడా మన తోటి మనుషులను ఆదుకోవటం లేదు"

లోపల మాలోని ముసలాయనకు కరోనా సోకిందని, ఆయన్ని క్వారెంటైన్‌లో 14 రోజులు ఉంచారు..'ఆ తర్వాత ఆ రోగమేమీ రాలేదని చెప్పి దవాఖానా నుండి పంపే సరికి లేటైపోయింది సార్".

"మరి రియలెస్టేట్ ఓనరు.." అని డౌటుతో అడుగుతుంటే.. నా మాట పూర్తిగాక ముందే మరో అతను కల్పించుకుంటూ "ఏమాదుకుంటారు సారూ! చేయించుకున్న న్నాళు రెక్కలరిగేంత చేయించుకుంటారు. గని మా కష్టాల్లో అదుకునుడు తెలువదు వాళ్లకు మా గోస ఏమని చెప్పాలన్నా" అని చెప్పాడు.

అంతలోనే మా గ్రూపంతా ఒక్కచోటికి వచ్చి రాగానే "మేరే భాయియో!" అని అందరినీ పిలుస్తూ "మనం మనుషులమై ఉండి కూడా మన తోటి మనుషులను ఆదుకోవటం లేదు, కానీ, కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవటం ఎంతైనా అవసరమని ఒక నిర్ణయానికి వచ్చాము. మీ అందరికీ సమ్మతమైతే మేము చెప్పేది వినండి. బతుకుదెరువు కోసం ఎన్నో మైళ్లు దూరం నుండి వచ్చి, రాతిరి పగలనకా కాయకష్టం చేస్తూ బతుకు నీడుస్తున్న మీకు అనుకోని ఈ వైరస్ ఆపద వచ్చి, మీ బతుకులన్నీ అతులాకుతలమైపోతాయి. దానికి తోడు ఒకరిని ఒకరు కలుసుకునే వీలు లేదు. ఈ వ్యాధి జనాలనందరినీ వనికిస్తున్నది, ఈ వ్యాధితో మరణించిన వారిని కనీసం ఆఖరి చూపును కూడా చూడనీయటం లేదు. ఇంతటి మహమ్మారి ప్రపంచంలో ఇంతవరకు రాలేదు. విచిత్రమేమిటంటే దీనికి ఇంతవరకు వైద్యం లేదు. మిలియన్ల డబ్బున్న వారైనా ఈ పూటకు లేని వారైనా అందరూ ఒక్కటే అయ్యారు. ఎవ్వరినీ వదిలేటట్టు లేదీ వైరస్. మీకేమో సరియైన అవగాహన, సౌకర్యాలు లేక ఇరుకు నివాసాలు, భౌతిక దూరం పాటించే పరిస్థితులు లేక ఇబ్బందులు పడుతున్నారు. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకొని మేమొక నిర్ణయానికి వచ్చాం" మరో సీనియర్ చెప్తున్నంతలో

"ఏంటి సార్ ఏంటీ" అని ఆతృతతో అడిగిందో వృద్ధురాలు.

"అదే చెప్పబోతున్నాను, వినండి ఓ వారం పది రోజుల నుండి ప్రతిరోజూ వందల వేల మంది వలస జనం ఈ రోడ్డు వెంబడి నడిచి వెళ్లటం గమనించి ఒక ఆలోచనకు వచ్చాము. అటు ప్రభుత్వానికి గాని ఇటు మీకు గాని మేము చందాల రూపంలో డబ్బు ఇవ్వవచ్చు. కానీ, అవి ఏ మూలకో, దాని కన్నా మనమే ఓ ఆశ్రమాన్ని నెలకొల్పి నిరుద్యోగులైన నా సాటి యువత సహకారంతో మా అజామాయిషీలో సేవా కార్యక్రమాలు ఆరంభిస్తే బాగుంటుందన్న నిర్ణయానికి వచ్చాము. అదేదో ఈ రోజు నుండే ఆరంభిస్తే పోతుందని అది మీతోనే మొదలుపెట్టాము.." అని చెప్తున్నంతలో..

"అంటే మమ్మల్ని ఇక్కడే ఉంచుకుంటారా! మేమైతే ఉండం బాబూ! మా దేశం (రాష్ట్రం మేము పోతాం" అని ఓ యువకుడు అంటుంటే..

"నీవు ఉంటానన్నా మేము ఉంచుకోం భాయ్.. ఇది కేవలం 5 సంవత్సరాల వయస్సు లోపల ఉన్న వారికే, అలాగే శారీరక బలహీనులకూ వయో వృద్దులకూ మాత్రమే. అది కూడా మీరు మీ పిల్లల్ని పోషించుకోలేక వారిని సుదూరంగా మోయలేక, ఎక్కడో పదో పాతికకో అమ్మేసుకుంటున్నారని తెలిపింది. వారిని మా స్నేహ హస్తం ద్వారా పెంచి పెద్ద చేసి విద్యాబుద్దులు చెప్పిస్తాం. ఆ తర్వాత మీ పిల్లల్ని తిరిగి మీరు తీసుకెళ్లవచ్చు. అలాగే వృద్ధులకు కూడా ఆహార ఆరోగ్య విషయాలను అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకుని, వారిని మా కన్న తల్లిదండ్రుల లాగా చూసుకుంటాము. వారిని కూడా మీరు తిరిగి తీసుకెళ్లవచ్చు. లేదంటే ఇక్కడే వదిలేసి వెళ్లవచ్చు. మా కెలాంటి అభ్యంతరం లేదు" అంటున్నంతలో..

"అయ్యా! మీరు నిజంగా దైవ స్వరూపులు ఎంత మంచి ఆలోచనలు వచ్చాయి సార్" అని ఒక వృద్ధుడు రెండు చేతులెత్తి నమస్కరిస్తుంటే

"అది సరే ఇదంతా చేయటానికి పెట్టుబడి చాలా.." అని మరో అతని అనుమానం వ్యక్తం చేస్తుంటే..

"పెట్టుబడి విషయంలో మీకు ఆందోళన అవసరం లేదు. ఆశ్రమం నిర్మాణానికి కావల్సిన డబ్బును ఎప్పుడో పోగు చేశాము. ఆరోగ్య చెకప్‌కు మా ఫ్రెండ్సే డాక్టర్లు ఉన్నారు, ఆయాల ట్రేనింగ్ చేసిన నిరుద్యోగులూ ఉన్నారు. వీలు చూసుకొని ప్రభుత్వ అనుమతిని కూడా తీసుకుని, లాభాపేక్ష లేని ఒక స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతానికి ఈ అతి ప్రమాదకరమైన ఆపదను గట్టెక్కించేద్దాం ఏమంటారు?" అని అడగగానే అక్కడ పోగైన జనమంతా చప్పట్లతో ఈ కొత్త కోణానికి స్వాగతం పలికారు.

*(నోట్: ఇది అవుతుందా? లేదా? అన్నదానికన్నా నా అంతరంగంలో నున్న ఒక చిన్న ఆలోచన అంతే దీన్ని విమర్శించే దృష్టిలో చూడరాదని మనవి...)*



-దారం గంగాధర్
సెల్:9848384777

## కమ్మనైన అమ్మభాష

కమ్మనైన అమ్మ భాషరా.. మనది
మధురమైన మాతృభాషరా..
అదే అదే అదే మన తెలుగు భాషరా.

వంపు సొంపులతోడ
వెలుగు జిలుగు విరజిమ్మి
జగమంతా మెచ్చుకొనగ
జైత్రయాత్ర సాగించి
గిడుగువారిచే వ్యావహారికమైన
పలుకుబడుల సంపద మన మాతృభాషరా...
అదే అదే అదే మన తెలుగు భాషరా

కృష్ణదేవరాయల మెప్పు పొంది
ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ గా పేరొంది
ప్రాచీన హోదాతో పరిమళించిన
అజంతపు సొగసు మన మాతృభాషరా
అదే అదే అదే మన తెలుగు భాషరా

గద్యాలు, పద్యాలు, నాటకాలతో
కవితలు, ఖండికలు, కథానికలతో
అలంకారయుతమైన కావ్యాలతో
తేనెలొలుకుతెనుగు మన మాతృ భాషరా
అదే అదేఅదే మన తెలుగు భాషరా

తల్లిలాగా లాలించి, తండ్రిలాగా ప్రేమించి
ఆత్మీయతను పంచి, అనురాగం కురిపించి
తరతరాల చరితకు వారధిగ నిలిచి
బతుకుతోవ చూపించిన మాతృభాషరా
అదే అదే అదే మన తెలుగు భాషరా.



-కందుకూరి భాస్కర్
9703487088

## జాడ

రాత్రి వాహనాలన్ని ఇంటికెళ్ళాయి .
కానీ ఫుట్ పాత్ పైకి
ఎవరోస్తారో తెలియదు.
కడుపులో ఖాళీలను పూరించడానికి
ఈ లోకం ఏ ఒక్క అవకాశం
ఇవ్వను లేదు .
ఆకలిని వెతికి వెతికి
అలిసిన కన్నులు
కునుకు కోసం దారి వెతుకుతున్నాయి .

ఈ దేశం చేసిన సంతకాల చట్టాలు
రోజూలాగే తన
ఖాళీ సంచిలో నింపుకోవడానికి వెళితే
చెత్త కుప్పలో విరివిగా దొరికాయి .
అయిన తనకేం తెలుసు
బడి లేదు బలపం లేదు .

అలా
ఆ కాగితాలను పరుపుగా
ఇటుక పెళ్లను దిండుగా జేసుకున్నాడు .
తన ఖాళీకడుపుపై చేయి తడుముతూ
మెల్లగా నిదురలోకి జారుకున్నాడో లేదో
లోకమంతా గందరగోళం సాగుతున్నది .
అయిన నిదుర బాగానే వచ్చేసింది .

మెల్లగా
తాను నేరమేమి చేయకుండానే
ఒంటినిండా బట్టలు ధరించినట్టుగా ,
కమ్మగా అమ్మ తన లేలేత బుగ్గలపై
ముద్దులు పెట్టినట్టుగా ,
బడిలో గురువు తన భుజాన్ని
నెమురుతుంటే చప్పట్లు కురిసినట్టుగా ,
సాయంత్రానికి కొన్ని సీతాకోకలు ,
తనతోటి దోస్తులందరు ఆకాశానికి వేలాడే
ఊయలలో ఊగినట్టుగా ,
కల వచ్చేసింది .
బహిరంగంగా లోకమేమో
కలలు కూడా మా సొంతమే అన్నట్టుగా
నిదుర చెడగొట్టేందుకు అరుస్తూనే ఉన్నది .
అయిన ఆకలిని మరిపించిన
కలతోనే సాగుతున్నది ఆ హృదయం .

ఇంతలో అటుగా
జీవన తాత్వికతను మోసుకు తిరుగుతున్న
ఓ కూశ్ పిల్ల వచ్చి
మనకు అంత సీన్ లేదని
తన పక్కను మెల్లగా తడిపేసింది .
లేచి చూస్తే
వీధి లైట్ కింద కిటకిటలాడుతున్న కీటకాలు
ఎక్కడో చీకట్లో కనపడకుండా
లోకాన్ని తిడుతున్న పురుగులు .

ఇంతలో తన కళ్ళలోకి చూస్తూ
ఆ కుక్కపిల్ల వికటాట్టహాసంతో తోకను ఆడిస్తూ
దేశం అంటే ఏమిటి ?
ఇంతకీ నీది ఏ దేశం అని ప్రశ్నిస్తూ
పక్కనే ఉన్న చెత్తకుండీ వైపు తీసుకుపోయింది.
ఇంతకీ నాది ఏ దేశం .

- రామ్ పెరుమాండ్ల

## మాతృభాష మెరుపులు

మాతృభాష అంటే
మమత లొలుకు
పరభాష అంటే
మది వణుకు !

తెలుగు దివిటీలు
సంప్రదాయాన్ని వెలిగించును
పరభాషా దీపాలు
సంస్కృతిని కాల్చేయును !

అమ్మ భాషకు
మనమంటే ఆదరణ
పరాయి భాషకు
మనమంటే నిరాధారణ !

తెలుగు పలకరింపులో
మది పులకించేను
ఆంగ్ల పలకరింపులో
రోత పుట్టించేను !

తెలుగు పాటలెప్పుడూ
కోకిల గానాలే
ఆంగ్ల పాటలెప్పుడూ
గార్ధభ గానాలే !



-రవి చంచల
8500330700

## మంచి సలహా

(కథ)

పూర్వం రత్నగిరి రాజ్యంలో తీవ్ర కరువు కాటకాలు వచ్చాయి. ఆ రాజ్యాన్ని ఏలే విక్రమసింహు నికి ఏమి చెయ్యాలో తోచలేదు. అయినప్పటికిని అతడు ప్రజలను ఆదుకుంటానని మాట ఇచ్చాడు. అతడు మాటతప్పని వాడు. చివరకు తన మహా మంత్రి సలహాచే రాజ్యంలోని ధనికులను విరాళాలు ఇమ్మని అడిగాడు. ఎవరైతే ధనికులుగా ఉండి ఈ ఆపద సమయంలో విరాళాలు ఇవ్వరో వారిని తగిన విధంగా శిక్షిస్తానని అన్నాడు.

ఆ రాజ్యంలోని మదనయ్య, సుందరయ్య మిక్కిలి ధనవంతులుగా పేరుగాంచారు.మదనయ్యది ఉదార స్వభావం .కానీ సుందరయ్య మహా పిసినారి. రాజు ప్రకటనతో సుందరయ్య గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయింది. ఎలాగైనా ఈ గండం నుంచి సుందరయ్య గట్టెక్కాలని అనుకున్నాడు. అందు కొరకై తెలివి గల తన బావమరిది అయిన గోవిందాన్ని సలహా అడిగాడు. సుందరయ్య పిసినారితనం సంగతి ఇదివరకే తెలిసిన గోవిందం "నాకు ఎంతో కొంత ముట్ట చెప్పనిదే నేను సలహా ఇవ్వను"అని అన్నాడు. అప్పుడు సుందరయ్య" నీకు ఇచ్చే బదులు రాజు గారికి విరాళంగా ఇచ్చింది నయం" అని అన్నాడు.

అప్పుడు గోవిందం" చూడు బావా! నాకు రెండు వేలు ఇచ్చావంటే నీ ఆస్తి మొత్తం కాపాడుతాను. అంతేకాదు .నీవు విరాళంగా రాజు గారికి ఒక్క నయాపైసా కూడా ఇవ్వాల్సిన అవసరం లేదు. రాజు గారికి ఆస్తి ఇచ్చినట్టే ఇచ్చి మళ్లీ సమయం వచ్చినప్పుడు నీ ఆస్తి నీవు తీసేసుకుంటావు .అలాంటి ఉపాయాన్ని నేను చెబుతాను. ఒకవేళ నా మాట పెడచెవిన పెట్టావంటే నీ ఆస్తి గురించి ఇతరులు ఎలాగూ రాజుగారికి చెబుతారు .రాజు నిన్ను పెద్ద మొత్తంలో విరాళాలు ఇవ్వమంటాడు .అప్పుడు నీ సంగతి ఆలోచించుకో "అని భయపెట్టాడు .అప్పుడు సుందరయ్య భారీ మొత్తంలో విరాళం ఇవ్వడం కన్నా ఈ గోవిందానికి ఎంతోకొంత ముట్టచెప్పింది నయమనుకొని "అలా కాదు .ఒక ఐదు వందలు ఇస్తాను. ఉపాయం చెప్పు "అని అన్నాడు. గోవిందం ఒప్పుకోలేదు. చివరకు వెయ్యి రూపాయలకు వారిద్దరి మధ్య బేరం కుదిరింది.

రాజు గారి ప్రకటన వెలువడగానే మదనయ్య, సుందరయ్య ఇద్దరూ కలిసి రాజుగారి ఆస్థానానికి వెళ్లారు. మొదట మదనయ్య తనవంతుగా యాభై వేల రూపాయల విరాళాన్ని ప్రకటించాడు. అప్పుడు రాజు సుందరయ్యను విరాళం అడిగాడు ."మహారాజా! రాజ్యం సుభిక్షం అయ్యేంతవరకూ నా యావదాస్తిని మన ఖజానాకు జమ చేస్తున్నాను" అని అన్నాడు. మహారాజు పరమానందభరితుడై సుందరయ్య ధర్మ గుణాన్ని వేనోళ్ళ పొగిడాడు. సుందరయ్య తన యావదాస్తిని ప్రకటించడం మదనయ్యకు ఒకింత ఆశ్చర్యానికి గురి చేసింది. రాజు సుందరయ్య ఆస్తి మొత్తం తన వశం చేసుకున్నాడు .

ఇలా రెండు సంవత్సరాలు గడిచాయి .తర్వాత వర్షాలు పుష్కలంగా పడి రత్నగిరి రాజ్యం సస్యశ్యామలం అయింది. ఏ కరువు కాటకాలు లేకుండా రాజ్యం కళకళలాడింది. ఇప్పుడు సుందరయ్య నిరుపేద. అతనికి పూట గడవాలంటేనే చాలా కష్టంగా ఉంది .అతడు వెంటనే రాజాస్థానానికి వెళ్లి తన ఆస్తిని తనకు ఇమ్మని అడిగాడు .అప్పుడు రాజు ఆశ్చర్యపోయి" నీవు నీ ఆస్తిని ఖజానాకు జమ చేశావు కదా !మళ్లీ నీ ఆస్తి అడుగుతున్నావే!"అని అన్నాడు ."మహారాజా !మీరు మాట తప్పని వారు. నేను కూడా మాటతప్పనివాడను. నేను ఆనాడే స్పష్టంగా చెప్పాను. మన రాజ్యం సుభిక్షం అయ్యేంతవరకూ మాత్రమే మన ఖజానాకు నా ఆస్తి జమ చేస్తున్నానని చెప్పాను .ఇప్పుడు రాజ్యం సుభిక్షమయ్యింది కదా!కనుక నా ఆస్తి నాకు ఇప్పించండి" అని అన్నాడు.

మహారాజు అందుకు అంగీకరించి అతని ఆస్తి మొత్తం అతనికి ఇప్పించాడు .అప్పుడు సుందరయ్య "మహారాజా !నేను ఇచ్చిన నా ఆస్తి మాత్రమే నాకు ఇస్తారా! ఆపదలో నేను మిమ్మల్ని ఆదుకున్నాను కదా! దానికి వడ్డీ కూడా ఏమి రాదా!" అని ప్రశ్నించాడు? రాజు అతని మాటలు విని "చూడు సుందరయ్యా! నీ ఆస్తి మొత్తం నీవు ఆనాడే ఖజానాలో జమ చేశావు. అసలు నీ ఆస్తి నీకు తిరిగి ఇవ్వడమే గొప్ప. మళ్ళీ దానికి వడ్డీ కూడా అడుగుతావేం!" అని అన్నాడు. అప్పుడు సుందరయ్య "మహారాజా !మీరే ఆలోచించండి. ఆనాడు నేను మన ఖజానాకు నా ఆస్తి అంతా జమచేసి రాజ్యం సుభిక్షం అయిన తర్వాత తీసుకుంటానని చెప్పలేదా! రాజ్యం సుభిక్షం కాకుంటే నేను మిమ్మల్ని అడిగేవాడినా! నేను ఇన్ని రోజులు రాజ్యం కొరకై పేదరికం అనుభవించలేదా! అందుకు ప్రతిఫలం ఇదేనా! "మన ఖజానాకు" అని నేను ఆనాడే చెప్పాను కదా! "మన ఖజానా" అని నేను అంటే అందులోని ఒక్క పైసా కూడా నాకు రాదా!" అని అన్నాడు. అప్పుడు రాజు అతని మాటల చాతుర్యానికి సంతోషించి తన ఖజానాలోని ఇరువది వేలను వడ్డీ కింద అతనికి ఇమ్మని ఆదేశాన్ని జారీ చేశాడు. దానితో సుందరయ్య పరమానందభరితుడై ఆనాడు తాను గోవిందానికి వెయ్యి రూపాయలు ఇచ్చినందుకు తనకు ఇరువది వేలు వడ్డీ లభించడమే కాక తన ఆస్తి మొత్తం తనకు దక్కిందని సంబరపడ్డాడు. అంతేకాకుండా తనకు ధర్మాత్ముడనీ, దాత అనీ [illegible] ప్రశంసలు కూడా దక్కాయని మిక్కిలి సంతోషం కలిగింది..తనకు మంచి సలహా ఇచ్చినందుకు సుందరయ్య తన బావమరిది గోవిందాన్ని తన మనసులోనే మెచ్చుకున్నాడు.



-సంగనభట్ల చిన్న రామ కిష్టయ్య
9908554535

## శివుని ఉత్తరానికి నా ప్రత్యుత్తరం

మీ ఉత్తరం అందింది
అది కూడా కవిత్వం లాగే వుంది
అది గుండె చెమ్మ కలిగి వుంది
అది మీరు నా ఉత్తరానికి
బదులుగా రాసిన ఉత్తరం–

నన్ను ప్రేమగా నిమిరింది
నన్ను మిత్రుని గా తలచింది
నన్ను తన అక్కున చేర్చుకుని
అభిమాన అక్షరామృతం
కురిపించింది–

నేను తనని గురువు గా ఎంచి
కొలిచి ఆరాధించిన వ్యక్తే
నేను తనని కొండంత ఎత్తులో
ఊహించుకొని మోస్తున్న వ్యక్తే
నన్ను నా భుజం మీద చెయ్యేసి
అక్కున చేర్చుకున్నట్టుంటే
నా నోరు ఎలా పెగులుతుంది
నా నోటంట మాట ఎలా వస్తుంది–

వర్షం వర్షించిందంటే నమ్ముతాం
పిడుగులు పడ్డాయంటే నమ్ముతాం
ఆకాశం కింద కి దిగొచ్చిందంటే
ఎలా నమ్ముతాం–

అతడు చిన్నా చితకా'కవి'నా
అతడు కబీరు సమాను
అతడు సరస్వతీ సమాను–

కానీ ఇది నిజం
ఇదో గొప్పవారి గొప్ప మనసుకీ
మనస్తత్వం కీ తార్కాణం.



-వి.సూర్యారావు
92469 11234

## మాతృభాష

తల్లి ఉగ్గుపాల తేనే ఉంటే
భావపరంపరలు సయ్యాట
అమ్మభాష అమృతతుల్యం
అందరు నేర్చే మొదటి భాష
మాతృభాష ఓంకార నాదంలా
చేరును మనసుకు పసిప్రాయాన

పలుకు పలుకున మధుర ఫలం
కళ, కవిత్వంల మేళవింపు
గోదావరి తరగల రంగరింపు
మదిని మీటు వీణనాదం మాతృభాష

అక్షరాలు చూడ కన్నెపిల్ల
నాట్య భంగిమలు కానవచ్చు
లలిత లావణ్య సౌకుమార్యం
చందన గంధ సౌరభం గోచరించే

కవిత్రయం చే కొనియాడబడి
శ్రీకృష్ణ సార్వభౌమ చే ఆదరించ బడి
అంతర్జాతీయ ఖ్యాతి గడించిన అద్వితీయం
అమ్మ ఆత్మీయ ఆలింగనం మాతృభాష

తెలుగునాట విరిసిన పూదోట
వసంతా చివురుల మేనా
సీతాకోకచిలుకలా విహరించారు
అమ్మ భాష మకరందం ఆస్వాదించు.



-సి. హేమలత
9666779103

## నానీలు

కలం
అలిగింది
అక్షరాలు మంచుముత్యాలై
ఊహలకొమ్మల్లో చిక్కెనని

ఎందుకో
ఏ భావాలు పుట్టట్లేదు
మనసు ఆకులు రాల్చింది
శిశిరంలా

రెప్పల తలుపులు
మూయలేదు కన్నులు
చేదు కలలేమైనా
వస్తాయనా

ఒంటరిగా
నిశీధినేలుతోంది మనసు
అమవాస రాత్రిని
ఆక్రమించి

గుండె
కాలుతోంది
అనుబంధాల కపటకొలిమిలో
బంగారమై మెరవ



-వకుళ వాసు
9989198334

## ముంబాయిలో ఘనంగా జరిగిన 3 పుస్తకాల ఆవిష్కరణ సభ

# "అక్షర యజ్ఞం"తో "మౌనం మాట్లాడుతుంది"-సిధారెడ్డి













బతుకు దెరువు కోసం ముంబాయికి చేరిన శ్రమజీవుల అక్షరం మాట్లాడుతోందని సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ ప్రముఖ కవి డా॥ నందిని సిధారెడ్డి అన్నారు. ముంబాయి దాదర్‌లోని ఆంధ్రమహాసభ హాలులో ఆదివారం రాత్రి దివంగత సంకు శాంతమ్మ, నారాయణ దంపతుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన కవన కిరణాలు, తెలుగు సాహితీ సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో దేవానంద్ నాగెళ్ళ **'అక్షర యజ్ఞం' శివమంచాల 'మౌనం మాట్లాడు తుంది'** కవితా సంపుటిల ఆవిష్కరణ సభలో ముఖ్య అతిథిగా నందిని సిధారెడ్డి పాల్గొని అక్షరయజ్ఞం పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.

తెలంగాణాలోని కొండాపూర్ గ్రామం నుంచి పొట్ట చేతపట్టుకుని వచ్చిన దేవానంద్ కాంట్రాక్టర్‌గా ఎదగడమే కాకుండా సామాజిక సేవతో పాటు సాహిత్యపరంగా కూడా సేవలందిస్తూ తన కంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారని తెలి పారు. అదే విధంగా ఆయన రెండవ పుస్తకం 'అక్షర యజ్ఞం' పేరులోనే ఒక యజ్ఞం వుంద న్నారు. భవనాలనే కాదు అక్షర భవనాలనూ నిర్మిస్తానంటూ ఈ పుస్తకాల ద్వారా ఆయన సందేశాన్నిస్తున్నారని ప్రశం సించారు. దేవానంద్ రాసిన కవితలలో ముంబాయి తో పాటు గ్రామీణుల, శ్రమజీవుల వెతలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా ముంబైని వలసజీవుల వెలుగు దీపంగా, అందరికీ అన్నంపెట్టే అమ్మగా అభివర్ణిస్తూ రాసే కవిత తో పాటు రైతులు, సైనికులపై రాసిన కవితలు చాలా అద్భుతంగా ఉన్నాయన్నారు.

కవి మంచాల శివ రాసిన **మౌనం మాట్లాడుతుంది** కవితా సంపుటి గురించి కూడా సిధారెడ్డి మాట్లాడారు. ముఖ్యంగా మౌనం మాట్లాడుతుందనే పేరులోనే పుస్తకంలో ఏముందోని చదవాలనిపించేలా ఉందన్నారు. పుస్తకంలోని పలు కవితలు మనసును హత్తుకునేలా ఉన్నాయన్నారు.

ఇద్దరు కవులూ భవన నిర్మాణరంగానికి చెందిన వారని అందుకే వీరిద్దరిని జంట కవులుగా ఆయన అభివర్ణించారు. ఎక్కడ మొదలైనా సరిహద్దుల నడుమ సాగేది జీవితం. సరిహద్దులు చెరిపేసి సంచరించేది కవిత్వం. నిరంతర బాటసారికి ఫలితాలతో పనిలేదు. అసలు కవులకు కాలంతోనే తృప్తి తప్ప ఫలితాల ప్రస్తావనే వుండదని అంటూ జీవితం వడపోసి కవిత్వం వడగడుతున్న దేవానంద్ నాగెల్ల, శివమంచాలను సిధారెడ్డి అభినందించారు.

మరో ముఖ్య అతిథిగా పాల్గొన్న నేటినిజం సంపాదకులు బైసదేవదాసు శివమంచాల **'మౌనం మాట్లాడుతుంది'** కవితా సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. చదువు ప్రాథమిక పాఠశాల దాటకపోయినా ఈ సమాజంలోని కుళ్ళు కుతంత్రాలను పరిశీలిస్తూ అక్షరాలకు పదును పెడ్తున్నందులకు శివమంచాలను అభినందించారు.

మొదట 'మనిషికి మరోవైపు' కవితా సంపుటితో సాహిత్యలోకంలో అడుగుపెట్టిన శివమంచాల ఇప్పుడు **'మౌనం మాట్లాడు తుంది'** అంటూ రెండవ పుస్తకంలో మనిషిని మనిషి గౌరవించడంలో మృగ్యమవుతున్న మానవ విలువల్ని ప్రస్తుత నీచ నికృష్ట పరిస్థితులను ఘాటుగా వెల్లడించారని శివమంచాలను ఆయన ప్రసంశించారు. 'కవన కిరణాలు' తెలుగు సాహిత్య సమాఖ్యను ప్రారంభించి అన్ని ప్రాంతాల కవులను సహకరించామన్నదే ముఖ్యమని, కవిత్వం తో మమేకమైనప్పుడే అది తెలిసి వస్తుందని తెలిపారు.

జ్యోతి వెలిగించి సభను ప్రారంభిస్తున్న అతిథులు

ఈ రోజు దేవానంద్ నాగెల్ల కొండాపూర్ కోటేశ్వరుడే కాదు సాహిత్య సామాజిక సేవతో ఎందరికో గొడుగుగా ఆసరా అవుతున్నందుకు ఆనందంగా వుందని నాగెల్లను ప్రశంసించారు. అక్షర యజ్ఞం చేస్తున్న దేవానంద్ నాగెల్లను, మౌనం మాట్లాడు తుంది అంటున్న శివమంచాలను ఆయన అభినందించారు.

శివమంచాల తెలుగు కవితా సంపుటిని ప్రముఖ కథకుడు, కవి అంబల్ల జనార్ధన్ హిందీలోకి అనువాదం చేసిన 'ఇన్సాన్‌కి దుస్రి పెహల్' పుస్తకాన్ని విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రముఖ సినీ గేయ రచయిత, కవి మౌనశ్రీ మల్లిక్ ఆవిష్కరించారు. శివమంచాల, దేవానంద్ నాగెల్లల కవిత్వాన్ని విశ్లేషిస్తూ కార్మికులుగా జీవితాన్ని ప్రారంభించి కలం చేపట్టి కవులుగా తమ జీవిత అనుభవాలను అక్షరాల్లో బందించి మనముందుంచారని, మున్ముందు ఇద్దరు మరింత మంచి సాహిత్యాన్ని అందించాలని కోరు తూ అభినందించారు.



"అక్షర యజ్ఞం" కవితా సంపుటి ఆవిష్కరణలో గాయకుడు రవీందర్, మండల గురునాథ్, ఏకనాథ్ సంగం, రాధామోహన్, పోతురాజారాం, మౌనశ్రీ మల్లిక్, దేవానంద్ నాగెల్ల, ఆవిష్కర్త డా॥నందిని సిధారెడ్డి, సంకు సుధాకర్, బైస దేవదాసు, శ్రీమతి బైస వీణాదాసు, సాహిత్య ప్రకాశ్, అంబల్ల జనార్ధన్, సంగెవేని రవీంద్ర, శివమంచాల.

విశిష్ట అతిథిగా పాల్గొన్న మరో కవి, రచయిత, వ్యాఖ్యాత, నటుడు సాహిత్య ప్రకాశ్ మాట్లాడుతు... దేవానంద్ నాగెల్లగారి **'అక్షర యజ్ఞం'**లో శివమంచాలగారి **'మౌనం మాట్లాడుతుంది'**లో సామాజిక అంశాలు చాలా వున్నాయని ఇద్దరి సాహిత్య కృషిని కొనియాడారు.

సభ్యకు అధ్యక్షత వహించిన ఆంధ్ర మహాసభ అధ్యక్షులైన సంకుసుధాకర్ మాట్లాడుతు.. కరోనా తర్వాత ఈ ప్రాంగణంలో జరుగుతున్న మొదటి సభ అని, ఇద్దరు కవులు తమ పుస్తకాలను ఆవిష్కరింపజేసుకుని కవిత్వంలో తమ ప్రతిభను చాటుకున్నందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రమహా సభ ట్రస్టు చైర్మన్ పోతు రాజారాం, ఆంధ్ర మహాసభ మాజీ చైర్మన్ ఏకనాథ్ సంగం, ఆంధ్ర మహాసభ సాంస్కృతిక శాఖ ఉపాధ్యక్షురాలు రాధామోహన్, ప్రముఖ కవి, రచయిత సంగెవేని రవీంద్ర, ప్రముఖ కవి, కథకుడు అంబల్ల జనార్ధన్, చారోకోస్ బాలాజీ మందిర్ ట్రస్ట్ చైర్మన్ మండల గురునాథ్, సహదేవ్, సుదర్శన్ యెల్డి పద్మశాలి, చింతకింది శంకర్, జక్కని గంగారాం తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉత్తమ ప్రచురణ కర్తగా నేటినిజం ప్రచురణ కర్త శ్రీమతి బైస వీణాదాసుకు లక్ష రూపాయల నగదు పురస్కారంతో సత్కరించినందులకు ఈ సభలో శ్రీమతి బైస వీణాదాసుకు అభినందన పురస్కారం అందించారు. ఈ సందర్భంగా వక్తలందరూ కవిత్వం పై తమదైన శైలిలో మాట్లాడి అందరిని ఆకట్టుకున్నారు.

తమను కవులుగా ఎదగడానికి సహకరిస్తున్న వారందరికి, ముఖ్య అతిథులుగా విచ్చేసి మూడు పుస్తకాలను ఆవిష్కరించిన డా॥నందిని సిధారెడ్డి, బైస దేవదాసు, విశిష్ట అతిథులు మౌనశ్రీ మల్లిక్, సాహిత్య ప్రకాశ్, వేదికను పంచుకున్న సంకు సుధాకర్, అంబల్ల జనార్ధన్, సంగెవేని రవీంద్ర, రాధామోహన్‌లకు సభకు విజయ వంతం చేసిన వారందరికీ పేరు పేరున దేవానంద్ నాగెల్ల శివమంచాల ధన్యవా దాలు తెలిపారు. సభకు ముందు నర్సారెడ్డి తనపాటతో అందరిని ఆకట్టుకున్నారు.



"మౌనం మాట్లాడుతుంది" కవితా సంపుటి ఆవిష్కరణలో మండల గురునాథ్, ఏకనాథ్ సంగం, రాధామోహన్, పోతురాజారాం, మౌనశ్రీ మల్లిక్, దేవానంద్ నాగెల్ల, డా॥నందిని సిధారెడ్డి, సంకు సుధాకర్, ఆవిష్కర్త బైస దేవదాసు, శ్రీమతి బైస వీణాదాసు, శివమంచాల, సాహిత్య ప్రకాశ్, అంబల్ల జనార్ధన్, సంగెవేని రవీంద్ర.



"శివమంచాల తెలుగు కవితా సంపుటిని హిందీ అనువాదం "ఇన్సాన్‌కి దుస్రి పహెల్" ఆవిష్కరణలో రాధామోహన్, పోతు రాజారాం, ఆవిష్కర్త మౌనశ్రీ మల్లిక్, దేవానంద్ నాగెల్ల, డా॥నందిని సిధారెడ్డి



రచయితలు శివమంచాల, దేవానంద్ నాగెల్లను సత్కరిస్తున్న అతిథులు.

ఏకం చేస్తు కవిత్వ రుచులను తెలుపుతూ సాహిత్య కృషి చేస్తున్న శివమంచాలను అభినందించారు.

మారుమూల గ్రామం తెలంగాణలోని కొండాపూర్‌లో జన్మించి ముంబాయిలో కార్మి కుడిగా జీవితం ప్రారం భించి కాసుల వేటలో కాంట్రాక్టరు స్థాయికి ఎదిగిన దేవానంద్ నాగెళ్ళ కవిగా 'అక్షర యజ్ఞం'లో అడుగులు




వేస్తున్నందుకు అభినందించారు. ధనం దరి చేరినా తృప్తి కలగలేదని కలం చేపట్టి కవితలు రాయ డంతో సంతృప్తి కలుగుతోందని వెల్లడించిన నాగెళ్ళ దేవానంద్‌ను అభినందించారు. కవిత్వం కొత్త జీవితాన్ని ప్రసాదిస్తుందని విలువలు మనీషిగా తీర్చిదిద్దుతుందని బైస దేవదాసు అన్నారు. ఎంత సంపాదించామని కాదు, ఎందరికి



శ్రీమతి బైస వీణాదాసును సత్కరిస్తున్న అతిథులు.

---

పుస్తక సమీక్ష

# సజీవ వర్ణాల కథలు.."ఇంద్రధనస్సు"






దినవహి సత్యవతి పేరు తెలుగు కథా రచనలో చాలా మందికి పరిచితమే. ప్రముఖ పత్రికలలో వీరి కథలు మనం చూస్తూనే ఉంటాము. చదువుతూనే ఉంటాం. 185 కవితలు, వ్యాసాలు, పదహేళికలు, బాలల కథలు రచించారు. అంతే కాకుండా నాటక రచనలు కూడా చేయడం, బహుమతులు సంపాదించడం కూడా వీరి జాబితాలో ఉంది. "ఇంద్ర ధనస్సు" వీరి రెండవ కథా సంపుటి. ఇందులో పేరుకి తగినట్లుగా ఏడు కథలున్నాయి. ప్రతి కథా ఒక్కో వర్ణంలా మెరిసిపోతుంటుంది. కథా వివరాల్లోకి వెళితే...

మొదటగా శీర్షిక కథ "ఇంధనుస్సు' విషయానికి వస్తే.. కనుమరుగైపోతున్న సంప్రదాయ కళని వస్తువుగా ఎంచుకున్నారు. సాధారణంగా చాలా చోట్ల నృత్యానికి పెద్దగా ఆశక్తి చూపరు. కానీ ఈ కథలో తనకు ఎంతో ఇష్టమైన నృత్యం నేర్చుకోవడానికి ఎన్నో కష్టనష్టాలను ఓర్చి, ప్రేమను త్యాగం చేసి తాను నృత్యకారిణిగా నిలబడటానికి చేసిన ప్రయత్నం ఈ కథా సారాంశం. ఏదయినా మనం సాధించడానికి అనేక అడ్డంకులు వచ్చాయని, అవే గనక లేకుంటే తాను ఎంతో సాధించేవారమని మనం అనేకసార్లు వినడం, అనడం చేస్తూనే ఉంటాం. కానీ మన ఇష్టం ముందు ఏదయినా పెద్ద కష్టం కాదు అని నిరూపించే తీరులో సాగిన కథ ఎంతో హుందాగా నడిచింది.

వీరి కథల్లో మహిళ అనేక అంశాల్లో సాధించిన విజయాల్ని ఎలుగెత్తి చూపడమే కనిపిస్తుంది. అలాంటిదే మరో కథ పేర్లు విషయంలో మనలో చాలా మంది ఇలాంటి పేర్లు ఎందుకు పెట్టారని, పాతకాలం కాకుండా సరికొత్తగా ఏదయినా ఉంటే బావుండేది కదాని అనుకుంటూ ఉంటారు. ముఖ్యంగా దేవుడి పేర్లను ఎవరూ స్వాగతించరు. పాతకాలం అని బాధపడుతుంటారు. అలాంటిదే ఈ కథ "అస్తిత్వం" లో వివరించేరు. పేరు వల్ల మనం గొప్పవాళ్ళం అవ్వడం అంటూ ఏమీ ఉండదు. మన వల్ల మన పేరుకు గొప్పదనం రావాలనే విషయాన్ని గ్రహించి మహిళలకు ఆదర్శంగా నిలిచిన ధీర మహిళ కథ ఇది. ఎంతో ఇన్‌స్పైరింగ్‌గా సాగిన ఈ కథ ఎందరికో మార్గదర్శకం.

మొదటి చూపులోనే కలిగే ప్రేమ ను మనలో ఎవ్వరూ అంగీకరించక పోయినా అది నిజమని అంటారు ఈ రచయిత్రి తమ కథ "ఇతడే అతడు". ఒక్కసారి ఒక వ్యక్తి మనసులోకి వచ్చాక మరొకర్ని జీవితంలోకి ఆహ్వానించడం అంత సులువు కాదని నిరూపిస్తూ.. పాఠకుల్ని మరోలోకంలోకి విహరింపజేసారు ఈ కథలో..

ప్రజాసేవ చేయడానికి సన్యాసం తీసుకోనక్కరలేదని, నన్‌గా వ్యవహరించనక్కరలేదని నిరూపించే మరో కథ "ఉషోదయం". ఈ కథలో తండ్రిపై కూతురుకి ఉండే ప్రేమ తెలియజేసే తీరు ఎంతో ఉన్నతంగా సాగింది.

మరో ఆత్మీయానుబంధాల గుభాళింపు "పడక కుర్చీ" కథ. పడక కుర్చీ అనగానే మనలో తెలియని ఆత్మీయత కలుగుతుంది. మన తండ్రో లేక తాతో టక్కున గుర్తుకు వస్తారు. ఆత్మీయతకు చిరునామాగా నిలిచిన ఆ బంధాల్ని తలుచుకోవడం అంటే ఇంతకంటే గొప్పదనం ఏముంటుంది?

జానపదం, పౌరాణికం కథలు చదివి చాలా కాలమే అయినందనుకున్నారేమో తమ కథల్లో ఆ ఉనికిని చూపారు. ఆ కథే "ముత్యాలరాజు– మాయా ఉంగరం" ఈ కథ ఆద్యంతం ఎంతో ఆసక్తిని రేకెత్తిస్తుంది. ఒక విధంగా మరో చందమామ కథను తలపిస్తుంది. మహిళా శక్తిని నిరూపించే కథ ఇది.

బిడ్డలు పుట్టలేదని ఒక బాధ, పుడితే ఆడపిల్లా.. అనే మరోబాధ, ఈ బాధల్ని అధిగమిస్తూ బుద్ది మాంద్యం ఉన్న బిడ్డను కంటే అంతకంటే తల్లితండ్రులకు నరకం వేరొకటి ఉండదు. ఆ విషయాన్ని విపులీకరించిన కథ "రాధికా విజయం". పెళ్ళి కాగానే ఏదో ఒక కారణంతో విడిపోతున్న యువతరాన్ని తట్టి లేపే కథ ఇది. ఇలాంటి కథలు ఇంకా అనేకం రావాలి అనిపించింది. నచ్చకున్నా తల్లికి, ఇష్టంలేకున్నా తండ్రిని, స్వార్థంతో తోబుట్టువులకి విడాకులు ఇవ్వలేము కదా? అదే విషయం ఒక్కసారి మూడు ముళ్ళు పడ్డాక తన భార్య లేదా తన భర్త అనే వాస్తవంలోకి ఎందుకు రాలేకపోతున్నామనే ప్రశ్న ప్రతి యువత తమను తాము వేసుకోవాలి. జబ్బు పడిన వారిని భరించడం కూడా జీవితంలో ఒక భాగమే అనే విషయాన్ని ఎందుకు గుర్తించరు? వంటి ప్రశ్నలకు సమాధానంగా అనేక కథలు రావాలి. ఈ కథ చదవగానే ఆ క్షణం గుండె భారమయింది.

సత్యవతి గారి కథలు ఎంతో సులభశైలిలో ఆకట్టుకునే రీతిలో సాగాయి. ఏడు కథల్లో ఏడు లోకాల్ని చూపారు. సాధారణంగా కొన్ని కథలు వాతావరణాన్ని వర్ణిస్తూ, మాండలికాల్ని మరింతగా జొప్పిస్తూ, సాగదీస్తూ ఇంకా ఎంత ఉంది అని వెనక్కు తిరిగి చూసుకుని విసుగు చెందించే కథలు ఎంత పేరెన్నిక గన్నా వాటివల్ల ఉపయోగం లేదు. కేవలం అవార్డులకు తప్ప, వదే వదే తలుచుకోవడానికి అవి పనికిరావు. అందుకేనేమో... కథలంటే చక్కని కాలక్షేపం. సమాజానికి ఒక ఓదార్పుగా ఉండాలని నిరూపించారు. మంచి కథల సమాహారాన్ని సప్త వర్ణాల్లా మనకు అందించిన రచయిత్రికి నా అభినందనలు..

–ప్రతులకు:
శ్రీమతి దినవహి సత్యవతి
ఫోన్: 9790752180



–శైలజామిత్ర
9290900879

---

## పేద..ధనిక

నిరుపేదల పిల్లలు..
బతుకుకై పోరాటము..
ధనవంతుల పిల్లలు..
బడికొరకై ఆరాటము..

ఏమిటిది భారతమ్మ..
ఎక్కువ తక్కువలెందుకమ్మా..
బడికెల్లె వయసులోన..
బాధ్యతలను మోస్తుండెను..
బడికోయె పిల్లల చూసి..

బాధతో కుములుతుండెను..
అయ్యయ్యో బాలలార..
చదువులమ్మకు దూరమైతిరా..

అక్షరాలు దిద్దుకుంటు..
ఆడుకునే వాళ్ళు మీరు..
తోటోళ్లను చూసుకుంటు..

తల్లడిల్లుతున్నరు..
ఎందుకింత ఘోరము..
పేదవాడిగా పుట్టడమేనా..

రాజ్యాంగమందులోనా...
రాసి ఉండెను హక్కులు..
రాత పూతలు నేర్చుకొని..

మార్చుకోండి బతుకులు..
చదువుకోండి బాలలు..
చక్కగుండును భవితలు..

–పసుల.శంకర్

---

## ఆనాడు.. - ఈనాడు..

ఆనాడు...
మతలబు లేకున్నా మాట్లాడేది
మాట మాట అనుకునేది
పరాచికాలతో ప్రవహించేది
మాటలతో పెనవేసుకున్న సంబంధాలు
టెక్నాలజీ , లేకున్నా
అడపాదడపా రాకపోకలుండేవి
ఒకరింట్లో మరొకరు తరచూ చేతులు కడిగేది
పరిచయమున్న ప్రతీవారు బంధువే
అథితులెవ్వరు ఇంటికొచ్చినా సంబరమే
కుశల ప్రశ్నలతో కలుపుకుపోవడమే
ఇళ్లు ఇరుకైనా ...
మనసంతా విశాలమే
పేద ధనిక తేడాల్లేవు
జీతంభత్యం పోటీల్లేవు
ఏ ఎండాకాగొడుగుల్లేవు
ఇచ్చిపుచ్చుకునే మర్యాదలు తప్ప.
తప్పొప్పులు లేవు
అన్నీ సర్దుకుపోవడాలే
పంతాలు పట్టింపులు లేవు
అన్నీ అర్థం చేసుకోవడాలే
ఒక ఇంట్లో శుభకార్యమైతే
ఆ వాడంతా సందడే
ప్రతీ ఇంటివారు తలో చెయ్యి వేసేవారు
పెళ్లి పందిరి అలంకరణలు
గుమ్మాలకు మామిడి తోరణాలు
దూలాలకు రంగు కాగితాలు
అర్ధరాత్రి కూరగాయలు తరగటాలు
మంచినీరు నింపడాలు
వంటకైనా , వడ్డనకైనా
"నేనంటే నేను " అని ముందుకువచ్చేవారు
కార్యం మొదటినుండి చివరివరకూ వెన్నంటివుండేవారు
ప్రేమాభిమానాలే అందరి సొత్తయ్యేవి
ఈర్ష్యాద్వేషాలకు చోటులేకపోయేది
కల్లాకపటమెరుగని మనసులే అందరికుండేవి .
ఈనాడు...
టెక్నాలజీ స్వంతమైనా
సంబంధాలు లేవు
కుశల ప్రశ్నలు కానరావు
మతలబుంటే తప్ప మాటల్లేవు
అనవసర పోటీలు పెరిగాయి
అర్థంలేని పోలికలు మించిపోయాయి
పరాచికాలు లేవు
రాకపోకల్లేవు
అర్థం చేసుకోవడాల్లేవు
అన్నీ అపార్థాలే ..
" నాకేంటి ? ఐతే నాకేంటీ ? " తత్వాలే .
పెద్ద పెద్ద ఇళ్ళు
ఇరుకైన మనసులు
కలవడాల్లేవు
కలుపుకోవడాల్లేవు
స్వార్థమే పరమావధిగా
సర్దుకుపోవడాల్లేవు
బంధాలను తెంచుకునేవారే
ఎక్కువ ఇక్కడ.
చుట్టాలు లేరిక్కడ ...
"పెడితే పెండ్లి లేదంటే సావు" కోరేవారు
సందుదొరికితే చాడీలేనంట .
దివసం పద్దరోజున
మొహమాటానికి "శుభాకాంక్షలు" చెప్పడాలు
లోకం కోసం బంధాలు గుర్తుకు తెచ్చుకోవడాలు
సాయాలు లేవు , తలో చెయ్యి వేసుడులేదు
క్యాటరింగుల జమానా ఇది
అంతా డబ్బుల వ్యవహారమిది
రంగురంగుల దుస్తులు
పలురకాల వంటకాలు
ఖరీదైన అలంకరణలు
అంతా కృత్రిమమే ఇక్కడ ..
సందడిగా ఉన్నా సందేహమే సుమా !
మన ఎవరో పరాయెవరో సంశయమే !
ముఖంపై నవ్వులైనా
మాట్లాడే మాటలైనా
గొప్ప నటనలు
"నల్లని" మనసులు .
జగమంతా ఇప్పుడు...
జీతాన్ని బట్టి విలువనిచ్చేవారు
అవసరంపూర్త మాట్లాడేవారు
ఎదురుపడితే మొఖంచాటేసేవారు
అక్కరకు రానివారు
చేసిన సాయం మరిచేవారు
చాటుకు చాడీలు చెప్పేవారు
ఎంగిలిచేత్తో కాకిని కొట్టనివారు
ఏ ఎండకు ఆ గొడుగు పట్టేవారు
జగమంతా వీరే ఎక్కువ ....
"ఈనాడు" అరుదయ్యిపోయింది "ఆనాడు "
అదృశ్యమైపోయారు "మనవారు " .



–రామడుగు వేణుగోపాల్
97455930441

---

## గోరెటి వెంకన్నకు నోబెల్ బహుమతి ఇవ్వాలి



గోరెటి వెంకన్న, తగుల్ల గోపాల్‌ను సత్కరిస్తున్న అతిథులు.

తెలంగాణ సాహిత్యాన్ని ప్రపంచానికి చాటి చెబుతున్న గోరెటి వెంకన్నకు నోబెల్ బహుమతి ఇవ్వాలని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ కోరారు. గోరెటి వెంకటన్న పాట, మాట వింటే మనసు పులకించిపోతుందని, ఎన్నిసార్లు విన్నా వినాలనిపిస్తుందన్నారు. తెలంగాణసాహితీ సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీతలు గోరెటి వెంకన్న, తగుల్ల గోపాల్‌కు ఆత్మీయ సత్కారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరీశంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెతుక్కుంటూ వేదికలపై మాట్లాడటంలో ఆయనకు ఎవరూ సాటిరారని అన్నారు. తెలంగాణ సాహిత్యానికి గోరెటి వెంకన్న అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. తగుల్ల గోపాల్ తన సాహిత్యం ద్వారా సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. సభకు ఆనందాచారి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో నవ తెలంగాణ ఎడిటర్ సుధాభాస్కర్, కవులు సీతారాం, యాకూబ్, స్ఫూర్తి తదితరులు పాల్గొన్నారు. పలువురు కవులు, సాహితీవేత్తలు గోరెటి వెంకన్నకు అభినందనలు తెలియజేశారు.

## ఉషశ్రీ ప్రసంగం ఆకర్షణీయం



నివాళులర్పిస్తున్న ఆచార్య ఇనాక్, కళా జనార్ధనమూర్తి తదితరులు.

ఉషశ్రీ ప్రసంగం తెలుగు శ్రోతలకు ఆకర్షణీయమని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో శనివారం పురాణ పండ ప్రకాశ్ దీక్షితులు (ఉషశ్రీ) జయంతి సభ గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆచార్య ఇనాక్ మాట్లాడుతూ స్వరంలో మాధుర్యం, చెప్పే విషయంపై అవగాహనతో కూడిన ఉషశ్రీ ప్రసంగం ఆకట్టుకుంటుందన్నారు. పురాణేతిహాసాలతో ప్రబంధాలపై సాధికారిక ప్రావీణ్యులు ఉషశ్రీ అన్నారు. ఆయన ఆకాశవాణిలో ధర్మసందేహాలకు సమాధానం చెప్పినా, భద్రాద్రి సీతారామకల్యాణం ప్రత్యక్ష వ్యాఖ్యానం చేసినా ఆ దృశ్యం శ్రోతల కళ్లకు కట్టినట్టు ఉండేదన్నారు. సమాజ సేవకులు ఓరుగంటి గోపాల్ జోషి, ఆత్మీయ నిర్మల, ఉషశ్రీ కుమార్తె వైజయంతి, కొమ్ము వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

